News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 01 | సంచిక :318 | ఖమ్మం | గురువారం,డిసెంబర్ 28, 2023 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



# ఖజానాలో చిల్లి గవ్వలేదు..
# కేసీఆర్ అంతా తుడిచి తీసుకెళ్లారు

## గడీల పాలన గ్రామాలకు..నేటి నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన

- లక్ష కోట్లు అవినీతి చేసి.. తిరిగి ఇచ్చింది రూ.లక్ష మాత్రమే!
- బాగున్న భవనాలను కూలగొట్టి కడితే సంపద సృష్టించినట్లా?
- అధికారం కోల్పోయిన బాధతో మాట్లాడుతున్న కేటీఆర్
- 2024 డిసెంబరు 9లోపు 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం
- లంకె బిందెలు ఉన్నాయనుకుంటే ఖాళీ కుండలు ఉన్నాయి
- విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- ప్రజల వద్దకు ప్రభుత్వాన్ని రప్పించేందుకే ప్రజా పాలన
- గ్రామసభలు ముగిశాక కూడా దరఖాస్తులు స్వీకరిస్తాం
- ప్రజాపాలన దరఖాస్తు లోగో ఆవిష్కరణలో ముఖ్యమంత్రి

సీకే న్యూస్ హైదరాబాద్ : కేసీఆర్ కుటుంబం దగ్గర ఉన్న ఆస్తి.. స్వేదం చిందించి సంపాదించింది కాదని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల రక్త మాంసాలను పీల్చి పిప్పిచేసి సంపాదించుకున్నారని, వారు తినేది రక్తపు కూడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రూ.లక్ష కోట్ల అవినీతి చేశారని, తిన్నదంతా కక్కిస్తామని ప్రకటించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రజా పాలన అభయ హస్తం గ్యారెంటీలకు శ్రీకారం చుట్టే కార్యక్రమ 'లోగో'ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ప్రజావాణి కార్యక్రమానికి ఒక ఆడబిడ్డ వచ్చింది.. మీరు పట్టించుకోకపోతే నేను పట్టించుకొని లక్ష రూపాయలు ఇచ్చానంటూ కేటీఆర్ ప్రకటించినట్లు చూశాను. కేటీఆర్! నీవు అక్రమంగా సంపాదించిన రూ.లక్ష కోట్లలో నుంచి ఇప్పుడు నీ మెడలు వంచి లక్ష రూపాయలు పేదలకు ఇప్పించగలిగామంటే ప్రజావాణి విజయవంతమైనట్లే కదా!" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేటీఆర్ అక్రమంగా సంపాదించిన రూ.లక్ష కోట్ల నుంచి ఒక లక్ష రికవరీ అయ్యిందని, ఇంకా రూ.99,99,999 లక్షలు ఆయన వద్దే ఉన్నాయని తెలిపారు. మిగిలినవి కూడా పంచాల్సిన గత్యంతరంలేని పరిస్థితి వారికి కల్పిస్తామని, దోచుకున్న సొమ్మును పంచక తప్పదని స్పష్టం చేశారు. మేనేజ్‌మెంట్ కోటాలో రాజకీయాల్లోకి వచ్చిన కేటీఆర్‌కు ఏమీ తెలియదని, అసెంబ్లీలో టైమ్ ఇస్తే మాట్లాడలేదని, ఇంటికి పోయి ఏదో అరుస్తున్నారని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బావాబావమరుదుల తాపత్రయం తప్ప.. ఒక్క సభ్యుడు కూడా వాళ్ల మాట్లాడేదాన్ని సమర్థించలేదని చెప్పారు.

**ఉన్న దానిని కూలగొట్టి కట్టడం సంపదా?**

పదేళ్లలో సంపద సృష్టించామని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని, కానీ.. బాగా ఉన్నవాటిని కూలగొట్టి కొత్తవి కట్టి సంపద సృష్టించినట్లు చెబుతున్నారని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. పాత సెక్రటేరియట్ గతంలో ఉమ్మడి రాష్ట్రానికి ఉపయోగపడిందని, 2012లో ఎల్అండ్ టీ కంపెనీ కట్టిన భవనాలు కూడా ఉన్నాయని, 12 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం, రాష్ట్రం విడిపోయిన తర్వాత సరిపోను భవనాలు ఉండేవని తెలిపారు. అద్దెభవనాల్లో కొనసాగుతున్న ఇతర ప్రభుత్వ కార్యాలయాలకో, హాస్పిటల్‌కో, ఇతర అవసరాలకో వినియోగించుకోవాల్సి ఉండగా దానిని నేలమట్టం చేశారని విమర్శించారు. ఒకవేళ పాత సెక్రటేరియట్ భవనం వారికి అచ్చిరాలేదనుకుంటే.. కొత్తగా వేరే చోట సెక్రటేరియట్ కట్టాల్సి ఉండేదని అన్నారు. ఉన్నదానిని కూలగొట్టి కొత్తది కడుతున్నారంటేనే దాని వెనుక ఉద్దేశమేంటో అర్థం చేసుకోవాలన్నారు. కేటీఆర్ అధికారం కోల్పోయిన

వివరాలు 2లో..

# సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీ
# ఘన విజయం..

- 3 వేల పైచిలుకు మెజారిటీ
- హోరాహోరీ పోరులో గుర్తింపు సంఘంగా ఆవిర్భావం
- సీపీఐ అనుబంధ సంఘానికి నాలుగోసారి ఆ హోదా
- 11 డివిజన్లలో ఐదింటిని గెలుచుకున్న ఏఐటీయూసీ
- డివిజన్లలో ఐఎన్‌టీయూసీదే పైచేయి.. ఆరింటిలో గెలుపు
- ఉమ్మడి ఖమ్మంలో స్వీప్.. ప్రాతినిధ్య సంఘం హోదా
- ప్రభావం చూపని బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్

వివరాలు 2లో..



# ప్రజాపాలనలో అధికారులు దరఖాస్తులను తిరస్కరించవద్దు

## ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం



- నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్న ఉత్తమ్
- అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచన
- లబ్ధిదారుల అర్హత అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టీకరణ

వివరాలు 2లో..

# దరఖాస్తు ఫామ్‌ను ఇలా ఇవ్వండి...

## ప్రజలకు మంత్రి సీతక్క సూచన

- నేటి నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన ఉంటుందన్న సీతక్క
- ఆధార్, రేషన్ కార్డుతో పాటు ఓ ఫొటోను జతపరిచి దరఖాస్తు ఫామ్ ఇవ్వాలని సూచన
- ప్రజాపాలన కార్యక్రమానికి అన్ని చర్యలు తీసుకోవాలని సూచన

వివరాలు 2లో..



సీకే న్యూస్ హైదరాబాద్ : నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు జరగనున్న ప్రజా పాలన సందర్భంగా ఆశావహులు ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో పాటు ఒక

# బీఆర్ఎస్ నాయకులది స్వేదపత్రం కాదు..
# సౌధపత్రం

- సమస్యల పరిష్కారం కోసమే ప్రజాపాలన
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



సీకే న్యూస్ హైదరాబాద్ : 'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇరవై రోజులైనా కాలేదు. బీఆర్ఎస్ నాయకులు స్వేదపత్రం పేరుతో విమర్శలు చేస్తున్నారు. వాళ్లది స్వేదపత్రం కాదు. సౌధపత్రం. అప్పులతోపాటు ఆస్తులు పెంచినమని గొప్పలు చెప్పున్నరు. తెలంగాణను అప్పుల్లో ముంచింద్రు.

వివరాలు 2లో..

# అలాంటప్పుడు మళ్లీ దరఖాస్తులు ఎందుకు కోరుతున్నారు?



- కాంగ్రెస్ ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్న కవిత
- పెన్షన్ల కోసం మళ్లీ దరఖాస్తులు ఎందుకు కోరుతున్నారని ప్రశ్న
- రేషన్ కార్డులు ఉన్నవారికే పథకాలు ఇస్తామని చెప్పడం సరికాదని వ్యాఖ్య

వివరాలు 2లో..

# జీహెచ్‌ఎంసీలో వార్డుకు 4 కౌంటర్లు ఏర్పాటు చేస్తాం

- ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు
- ఒక్కో కౌంటర్ కు టీమ్ లీడర్ సహా 8 మంది సభ్యులు
- కౌంటర్ల ఏర్పాటుపై ముందే సమాచారం అందిస్తామని వెల్లడి



సీకే న్యూస్ హైదరాబాద్ :ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీలో మహిళలకు ఉచిత రవాణా సదుపాయం కల్పించగా.. మిగతా హామీలను వీలైనంత త్వరగా అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ప్రజాపాలన కార్యక్రమం చేపట్టింది. ఈ నెల 28 నుంచి అధికారులు ప్రజల వద్దకే వెళ్లి దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో ప్రభుత్వం

వివరాలు 2లో..

# సింగరేణి ఎన్నికల్లో ఏఐటీయూసీ ఘన విజయం..

సింగరేణి బొగ్గుగనులపై ఎర్ర జెండా రెపరెపలాడింది. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికలోకం సీపీఐ అనుబంధ సంఘమైన ఏఐటీయూసీకి పట్టం కట్టింది. దశాబ్దాల పోరాటాల చరిత్ర కలిగిన 'సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్'ను (ఏఐటీయూసీకి అనుబంధం) కార్మికులు తమ ప్రతినిధిగా ఎన్నుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని మందమర్రి, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ డివిజన్లలో, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోల్‌బెల్ట్ ప్రాంతం రామగుండం-1, రామగుండం-2 డివిజన్లలో ఏఐటీయూసీ విజయం సాధించింది. తద్వారా సింగరేణి కాలరీసలో ఏడో పర్యాయం జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ ఘనవిజయం సాధించింది. కాగా, ఏఐటీయూసీకి గట్టి పోటీనిచ్చిన కాంగ్రెస్ అనుబంధ కార్మికసంఘం ఐఎన్‌టీయూసీ.. కొత్తగూడెం కార్పొరేట్, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, రామగుండం-3, భూపాలపల్లి డివిజన్లలో విజయం సాధించింది. ఖమ్మం జిల్లాలోని మొత్తం నాలుగు డివిజన్లలోనూ ఆ సంఘం క్లీన్‌స్వీప చేయటం విశేషం.

అయితే, ప్రధాన ఏరియాలతో పాటు మెజారిటీ ఓట్లు సాధించిన ఏఐటీయూసీని విజయం వరించింది. ఆ సంఘం మూడు వేల ఓట్ల పైచిలుకు మెజార్టీని సాధించింది. ఒక్క శ్రీరాంపూర్ డివిజన్‌లోనే 2166 ఓట్ల మెజార్టీని ఏఐటీయూసీ సాధించడం విశేషం. మందమర్రి ఏరియాలో 261 ఓట్లతో ఏఐటీయూసీ విజయం సాధించింది. సింగరేణి చరిత్రలో గుర్తింపు సంఘంగా ఎన్నికవటం ఏఐటీయూసీకి ఇది నాలుగోసారి. ఎన్నికల్లో మొత్తం 13 సంఘాలు పోటీ పడగా ఏఐటీయూసీని గుర్తింపు కార్మిక సంఘంగా, ఐఎన్‌టీయూసీనిప్రాతినిధ్య సంఘంగా కార్మికులు ఆమోదించారు. హెచ్‌ఎంఎస్, బీఎంఎస్, సీఐటీయూ తదితర కార్మిక సంఘాలు ఏ ఒక్క డివిజన్‌లో కూడా కనీసం ప్రాతినిధ్యాన్ని కూడా దక్కించుకోలేకపోయాయి. ఏఐటీయూసీకి ఐఎన్‌టీయూసీ సింగరేణి వ్యాప్తంగా గట్టి పోటీని ఇచ్చింది. ఏఐటీయూసీకి బీఆర్‌ఎస్ అనుబంధ విభాగమైన 'తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం' బేషరతు మద్దతు తెలుపకపోతే పరిస్థితులు మరోలా ఉండేవనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి వ్యాప్తంగా ఓటర్లు కాంగ్రెసకు పట్టం కట్టారు. కోల్‌బెల్ట్‌లోని పది అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ కలిసి పోటీ చేసిన విషయం తెలిసిందే.

**ప్రశాంతంగా పోలింగ్**

బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. 94.15 శాతం పోలింగ్ నమోదయింది. మొత్తం 39,773 మంది కార్మికులు ఉండగా, 37,458 మంది కార్మికులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికల కంటే స్వల్పంగా పోలింగ్ శాతం తగ్గింది. 2017 అక్టోబరు 5వ తేదీన జరిగిన ఎన్నికల్లో మొత్తం 52,534 మంది కార్మికులకుగాను 49,873 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆ ఎన్నికల్లో 94.93 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి స్వల్పంగా 0.78 శాతం ఓటింగ్ తగ్గింది. కాగా, ఈ ఎన్నికల్లో మహిళా కార్మికులు కూడా భారీగా తరలివచ్చి ఓట్లు వేశారు. 16 వేలకు పైగా ఉన్న యువ కార్మికులు కూడా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. మొత్తం 13 కార్మిక సంఘాలు బరిలో ఉన్నప్పటికీ ప్రధానంగా ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ మధ్యే పోటీ జరిగింది. అక్కడక్కడ స్వల్ప ఘర్షణలు, వాగ్వాదాలు మినహా సింగరేణి వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 11 డివిజన్లలో కార్మికులు ఉదయం నుంచే ఓటింగ్ కోసం బారులు తీరి ఓటింగ్‌లో పాల్గొన్నారు. అత్యధికంగా ఇల్లందు ఏరియాలో 98.37 శాతం ఓటింగ్ నమోదు కాగా, అత్యల్పంగా రామగుండం-3లో 93 శాతం నమోదయింది.

**గులాబీ జెండా కనుమరుగు**

సింగరేణి గనుల్లో ఈసారి బీఆర్‌ఎస్ గులాబీ జెండా కనుమరుగైంది. 2012, 2017లో సింగరేణి గుర్తింపు సంఘంగా కొనసాగిన ఆ పార్టీ అనుబంధ విభాగం టీబీజీకేఎస్ ప్రస్తుత ఎన్నికల్లో అనూహ్యంగా వెనక్కి తగ్గింది. ఎన్నికల్లో పోటీకి నామినేషన్ వేసినప్పటికీ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత క్యాడర్‌లో నైరాశ్యం నెలకొంది. దీంతో గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీకి టీబీజీకేఎస్ ఆసక్తి చూపలేదు. అధిష్ఠానంపై నేతలు ఒత్తిడి తెచ్చినా పోటీకి ససేమిరా అనటంతో సంఘానికి కీలక నేతలు గుడ్‌బై చెప్పారు. చాలా ఏరియాల్లో కీలక నేతలు ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీల్లో చేరారు. కొన్ని ఏరియాల్లో టీబీజీకేఎస్ నేతలు ఏఐటీయూసీకి మద్దతు ఇవ్వాలని తీర్మానం చేశారు. దీంతో గుర్తింపు సంఘం ఎన్నికల్లో గనుల వద్ద ఎక్కడా కూడా గులాబీ జెండా కనిపించలేదు. ఆ సంఘం ఎన్నికల చిహ్నామైన బాణం గుర్తుపై ఓటు వేయాలని కోరేవారు కూడా కనిపించలేదు. గనులపై ఎర్రజెండాలు, మూడు రంగుల జెండాల సందడే కనిపించింది. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నేతల మధ్య స్వల్ప ఘర్షణలు, వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ కేంద్రాలను ప్రధాన కార్మిక సంఘాల నాయకులతోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పర్యవేక్షించారు. కొత్తగూడెం ఏరియాలో కొత్తగూడెం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు (సీపీఐ), జారె ఆదినారాయణ (కాంగ్రెస్) తమ పార్టీ అనుబంధ సంఘాలకు ఓట్లు వేయాలని పోలింగ్ కేంద్రాల సమీపంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద కార్మికులను అభ్యర్థించారు. ఇల్లెందులో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మణుగూరులో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. ఐఎన్‌టీయసీకి ఓటేయాలని కార్మికులను కోరారు. డిప్యూటీ లేబర్ కమిషనర్ దేవరకొండ శ్రీనివాసులు పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

**ఖమ్మంలో ఐఎన్‌టీయూసీ స్వీప్**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సింగరేణి నాలుగు డివిజన్లలో ఐఎన్‌టీయూసీ హవా చాటింది. నాలుగు డివిజన్లలో మొత్తం 6,581 ఓట్లుండగా 6,335 పోలయ్యాయి. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో మొత్తం 1,146 ఓట్లు పోలవ్వగా ఐఎన్‌టీయూసీకి 471ఓట్లు, ఏఐటీయూసీకి 251ఓట్లు, బీఎంఎసకు 261ఓట్లు, సీఐటీయూకి 40, టీబీజీకేఎసకు 32ఓట్లు పోలయ్యాయి. ఇందులో 220ఓట్ల మెజారిటీతో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. కొత్తగూడెం ఏరియాలో మొత్తం 2207 ఓట్లు పోలవగా ఐఎన్‌టీయూసీకి 1128, ఏఐటీయూసీకి 896 ఓట్లు రాగా 232 ఓట్ల మెజార్టీతో ఐఎన్‌టీయూసీ గెలిచింది. ఇల్లెందులో 604 ఓట్లు పోలవగా ఐఎన్‌టీయూసీకి 311 ఓట్లు, ఏఐటీయూసీకి 264, బీఎంఎసకు 9, సీఐటీయూకి 7, ఇఫ్టూకు 7, టీబీజీకేఎసకు 1, ఇతరులకు 4 ఓట్లు వచ్చాయి. 46 ఓట్ల మెజార్టీతో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. మణుగూరు ఏరియాలో మొత్తం 2,378 మంది కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోగా ఐఎన్‌టీయూసీకి 778, ఏఐటీయూసీకి 776 ఓట్లు వచ్చాయి. అయితే ఇక్కడ అనూహ్యంగా టీబీజీకేఎసకు 728 ఓట్లు పోలయ్యాయి. ఇఫ్టూకు 3 ఓట్లు వచ్చాయి.

# ఖజానాలో చిల్లి గవ్వలేదు..
# కేసీఆర్ అంతా తుడిచి తీసుకెళ్లారు

- మొదటి పేజి తరువాయి

బాధలో ఏవేవో మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. "మందు కల్లు తాగినోడికి సడెన్‌గా మందు కల్లు దొరకకపోతే.. పిచ్చిపిచ్చి చేష్టలు చేస్తరు. అప్పుడు కుటుంబ సభ్యులే తాళ్లు కట్టి మంచానికి కట్టేస్తారు. అధికారం పోయిన విత్‌డ్రాయల్ సిమ్టమ్స్‌తో కేటీఆర్ పిచ్చి పిచ్చి మాట్లాడుతున్నారు. కొంతకాలం తర్వాత కుటుంబ సభ్యులే ఆయనను కాళ్లు మంచానికి కట్టే పరిస్థితి వస్తుంది. అధికారం కోల్పోయిన బా?ధతోనో, భయంతోనో ఆయనమాట్లాడుతు న్నారు" అని రేవంత్ ఎద్దేవా చేశారు.

**షాడో టీమ్‌తో ఏం చేస్తారు?**

అసెంబ్లీలో మైకు ఇస్తేనే కేటీఆర్ మాట్లాడలేదని, నిర్ణయాలను విశ్లేషించమని అవకాశమిస్తే వినియోగించుకోలేదని సీఎం రేవంత్ అన్నారు. ఇప్పుడు వెనక షాడో టీమ్ పెట్టుకొని చేసేదేముందని ప్రశ్నించారు. "నిన్నటివరకు మంత్రులుగా పనిచేసిన వాళ్లు మీ వద్దనే ఉన్నారు కదా! వాళ్లనే పనిచేయమనండి. అప్పుడు ఒళ్లు వంచలేదు. ఇప్పుడైనా ఒళ్లు వంచి ప్రజలకోసం పనిచేయండి." అని రేవంత్ సూచించారు. కాళేశ్వరం, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నిర్మాణ పనులు, అవినీతిపై విచారణకు ఆదేశించామని, అలాగే ఛత్తీసగఢ్‌తో విద్యుత్ ఒప్పందం, యాదాద్రి- భద్రాద్రి పవర్ ప్రాజెక్టుల మీద కూడా జ్యుడీషియల్ విచారణకు ఆదేశించామని తెలిపారు. రెవెన్యూ రికవరీ యాక్టుతో అంతా రికవరీ అవుతుందని అన్నారు. ఎల్‌అండ్‌టీ పాత్ర ఏంటో, హరీశ్‌రావు, కేసీఆర్, అధికారుల పాత్ర ఏంటో అన్నీ జ్యుడీషియల్ విచారణలో బయటకి వస్తాయన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇంకా 30 రోజులు కూడా కాలేదు. ఇప్పుడే ఏమైంది? ముందుంది ముసళ్ల పండుగ" అని వ్యాఖ్యానించారు.

**టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఉంటేనే నియామకాలు**

పరీక్షల నిర్వహణ, ఫలితాలు ప్రకటన, ఉద్యోగ నియామకాలు చేయాలంటే తప్పనిసరిగా టీఎసపీఎస్సీకి చైర్మన్ ఉండాలని, లేకపోతే ఈ ప్రక్రియ జరగకపోవడంతోపాటు చట్టపరంగా చెల్లదని సీఎం తెలిపారు. గత చైర్మన్, సభ్యులు రాజీనామా పత్రాలు సమర్పించారని, గతంలో గవర్నర్ వద్దకు వచ్చిన ఫిర్యాదులమేరకు వారు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అన్నారు. ఆ తర్వాత కొత్త చైర్మన్, సభ్యులను నియమించుకొని పారదర్శకంగా నియామకాలు చేపడతామని పేర్కొన్నారు. నిరుద్యోగులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, తాము విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా ఏడాది తిరిగేలోపు 2024 డిసెంబరు 9వ తేదీ లోగా 2లక్షల ప్రభుత్వ ఉద్యోగుల ఖాళీలను భర్తీచేస్తామని ప్రకటించారు.

**ప్రజావాణి పటిష్టంగా పనిచేస్తోంది..**

ప్రజావాణి వ్యవస్థ పటిష్ఠంగా పనిచేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అక్కడ ఒక ఐఏఎస్ అధికారి ఉన్నారని, శాఖల వారీగా అప్లికేషన్లు పంపిస్తున్నారని పేర్కొన్నారు. సెల్ నంబరుకు సమాచారం ఇస్తున్నామని వివరించారు. స్థానికంగా పరిష్కరించే సమస్యలపై దరఖాస్తులు హైదరాబా ద్‌లో ఇచ్చినా తిరిగి ఎమ్మార్వో ఆఫీసుకే పంపించాల్సి ఉంటుందన్నారు. రైతుబంధు నిధుల జాప్యంపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "రైతుబంధు నిధులను గత ప్రభుత్వం మార్చి వరకు రైతుల ఖాతాల్లో జమచేసింది. ఈసారి డిసెంబరు 9 రోజే జమ చేసినం. కానీ, విచిత్రంగా.. బావా బావమరుదులు తోక తెగిపడిన బల్లుల్లాగా దుంకులాడుతున్నారు. అన్ని ఖాళీ చేసిపోయారు. ఇక్కడ ఏమీలేదు. మేము లంకె బిందెలున్నాయనుకొని వస్తే.. ఖాళీ కుండలు కనిపిస్తున్నాయి. కేసీఆర్ అంతా ఊడ్చి పెట్టుడు కాదు.. తూడ్చి పెట్టారు. ఖజానా మొత్తం డ్రై అయిపోయింది" అని రేవంత్ అన్నారు. అందుకే కేంద్రం నుంచి రావాల్సిన నిధులకోసం ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలిశామని, ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పటానికి శ్వేతపత్రం విడుదలచేశామని పేర్కొన్నారు.

**రైతుబంధుకు సీలింగ్ లేదు**

రైతుబంధు పథకానికి ఇప్పటివరకు ఎటువంటి సీలింగ్ విధించలేదని సీఎం రేవంత్ చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లో చర్చ పెడతామని, అందరి అభిప్రాయాలు తీసుకొని ఓ నిర్ణయానికి వస్తామన్నారు. ఆరు గ్యారెంటీల అమలుకు వంద రోజుల సమయం ఉందన్నారు. గవర్నర్‌తో సంబంధాలు ఇప్పుడు ఉన్నట్లుగానే భవిష్యత్తులోనూ కొనసాగుతాయన్నారు. కేంద్రాన్ని బుల్లెట్ ట్రెయిన్ అడగలేదని బీఆర్‌ఎస్ నేత వినోద్‌కుమార్ చేసిన విమర్శలపై సీఎం స్పందిస్తూ.. ఓసారి అద్దంలో ముఖం చూసుకొని మాట్లాడాలన్నారు. ఇక రేషన్ కార్డు లేకుండా సంక్షేమ పథకాలను అమలుచేయటం కష్టమని, కానీ రేషన్ కార్డులు లేనివారికి ఇస్తామని అన్నారు. ప్రధాని మోదీని తెలంగాణ ప్రజల తరఫున కలిశామని, తమకు ఏ రహస్య ఎజెండా లేదని రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన అంశాలపై అడిగామే తప్ప.. కేసులు మాఫీ చేయాలని గానీ, అవినీతి చేసిన వాళ్లని ఉపేక్షించమని గానీ అడగలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోడ్రైవర్ల ఆదాయానికి గండిపడుతుందని ఊహించే.. ఆర్థిక సాయం ప్రకటన చేశామని సీఎం గుర్తు చేశారు. అవినీతిని, దుబారాను నియంత్రిస్తే.. రాష్ట్రం మిగులు బడ్జెట్‌లోకి వస్తుందన్నారు. కేసీఆర్ సర్కారు అవినీతి, దుబారాతోనే నష్టం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు చేయదని చెప్పారు. కేంద్రంతో పేచీలు పెట్టుకోబోమని స్పష్టం చేశారు.

**హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం ఉండదు..**

ప్రజలు ప్రయాణ ఖర్చులు, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటూ హైదరాబాద్ రావాల్సిన అవసరం ఇకపై ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు గ్రామసభల ద్వారా ప్రజల మధ్యకు వస్తారని చెప్పారు. ప్రతి అధికారి రోజుకు రెండు గ్రామాలకు వెళ్తారని, జనాభా ఎక్కువ ఉన్న గ్రామాల్లోనైతే.. ఎక్కువ కౌంటర్లు తెరిచేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. 2023 డిసెంబరు 28 నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు ప్రతి గ్రామ పంచాయతీలో కార్యదర్శినిగానీ, అంగన్‌వాడీ టీచర్‌ను గానీ అందుబాటులో ఉంచుతామని సీఎం చెప్పారు.

**గడీల పాలనను ప్రజల ముంగిట్లోకి తెస్తున్నాం..**

తండాలు, గూడేలు, మారుమూల పల్లెల్లోని నిరుపేదలకు ప్రభుత్వ పథకాలను చేరవేసే లక్ష్యంతోనే ప్రజా పాలన గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. నిస్సహాయులకు సాయం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంతో ప్రజలను హైదరాబాద్‌కు రప్పించుకోకుండా.. గడీల ముందు, గడీల లోపల ఉన్న ప్రభుత్వాన్ని ప్రజల ముంగిట్లోకి తీసుకెళ్లాలని, ప్రజల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రజా పాలన అభయ హస్తం గ్యారెంటీలకు శ్రీకారం చుట్టే కార్యక్రమ 'లోగో'ను ముఖ్యమంత్రి ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ప్రజావాణిలో తమ సమస్యలను ప్రభుత్వానికి విన్నవించుకునేందుకు వేలాది మంది ప్రజలు సుదూర ప్రాంతాల వ్యయ ప్రయాసలకోర్చి నుంచి దరఖాస్తులు చేతబట్టుకొని ప్రజాభవన్‌కు ముందురోజు రాత్రే తరలి వస్తున్నారని తెలిపారు. ఇందుకు కారణం.. పదేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో లేకపోవడం, పరిపాలన ప్రజల వద్దకు చేరకపోవడమేనని అన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వాలు మోయలేనంత భారంగా మారాయని, వారంలో రెండు రోజులు ప్రజావాణి కార్యక్రమం చేపడితే దాదాపు 24 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటన్నింటిపై విశ్లేషించి ఆయా శాఖలకు పంపించి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రజలను ప్రభుత్వం వద్దకు రప్పించుకోవడం కాకుండా.. ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లడం ద్వారా వారికి న్యాయం చేయవచ్చని భావించి ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు.

## జీహెచ్‌ఎంసీలో వార్డుకు 4 కౌంటర్లు ఏర్పాటు చేస్తాం

- మొదటి పేజి తరువాయి

చేస్తున్న ఏర్పాట్లను మంత్రి శ్రీధర్ బాబు మీడియాకు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రిగా వ్యవహరిస్తున్న శ్రీధర్ బాబు బంజారా భవన్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి అధికారులతో రివ్యూ నిర్వహించారు. అనంతరం శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. గ్రేటర్ పరిధిలోని 150 వార్డుల్లో ఒక్కో వార్డుకు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఒక్కో కౌంటర్ కు ఒక టీమ్ లీడర్, ఏడుగురు సభ్యులు ఉంటారని వివరించారు. వార్డులోని ఏ బస్తీలో ఏ రోజు కౌంటర్ ఏర్పాటు చేస్తారనే విషయాన్ని ముందుగానే సమాచారం ఇస్తామని తెలిపారు. మహిళలు, వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. దరఖాస్తులు నింపడం తెలియని వారి కోసం వాలంటీర్లను కూడా అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. అనివార్య కారణాలతో కౌంటర్ ఏర్పాటు చేసిన రోజు దరఖాస్తు చేసుకోకుంటే జనవరి 6 వరకు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తామని వివరించారు. దీంతో పాటు ఆన్ లైన్ లో దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక సాఫ్ట్ వేర్ కు రూపకల్పన చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## ప్రజాపాలనలో అధికారులు దరఖాస్తులను తిరస్కరించవద్దు

**హైదరాబాద్** :నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామపంచాయతీల్లో దరఖాస్తులను స్వీకరిస్తామని... అధికారులు ఈ దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించకూడదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారెంటీల అమలు కోసం రేపటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఆరు గ్యారెంటీలపై వాగ్దానం చేసి ఎన్నికలకు వెళ్లామన్నారు. వాటిని అమలు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. రేషన్ కార్డులు లేనివారు కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అధికారులు పారదర్శకంగా విధులను నిర్వర్తించాలన్నారు. లబ్ధిదారుల అర్హత అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రజల ఆకాంక్షలతో ఏర్పడిన ఈ ప్రభుత్వం వారి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తుందని హామీ ఇచ్చారు.

## దరఖాస్తు ఫామ్‌ను ఇలా ఇవ్వండి...

- మొదటి పేజి తరువాయి

ఫోటోను జతపరిచి దరఖాస్తు ఫామ్‌ను స్థానిక అధికారులకు అందజేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రజాపాలనపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులతో ఆమె బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.రేపటి నుంచి ప్రారంభమయ్యే ప్రజాపాలన కార్యక్రమానికి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు ఇబ్బంది లేకుండా గ్రామాల్లో వాటిని తీసుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు... సమన్వయంతో ప్రభుత్వ పథకాలను విజయవంతం చేయాలని వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ జిల్లాలో పోడు భూములను సాగు చేస్తున్న రైతులకు పట్టాలు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## అలాంటప్పుడు మళ్లీ దరఖాస్తులు ఎందుకు కోరుతున్నారు?

హైదరాబాద్ :కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలోని గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను వినియోగిస్తే బిల్లు కట్టవలసిన అవసరం లేదని... ప్రభుత్వ పెద్దలే ఈ విషయాన్ని చెప్పారని... కాబట్టి నిర్ణీత యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించు కున్నవారు కరెంట్ బిల్లు కట్టవలసిన అవసరం లేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆమె బుధవారం నిజామాబాద్ రూరల్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అర్హులకు సంక్షేమ పథకాలు అందాలంటే దరఖాస్తు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని... దీంతో ప్రజలకు రెండు మూడు అంశాలపై అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. తెలంగాణలో ఇప్పటికే 44 లక్షల మందికి పెన్షన్లు అందుతున్నాయని.. అలాంటి వారికి దరఖాస్తు అవసరం లేకుండా పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4వేల వరకు పెంచవచ్చునని సూచించారు. అలాంటప్పుడు మళ్లీ దరఖాస్తులు ఎందుకు కోరుతున్నారు? అని ప్రశ్నించారు. మరోసారి దరఖాస్తులు చేసుకోవాలంటే ప్రజలు ఇబ్బందులకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉన్న రేషన్ కార్డులకే పథకాలు ఇస్తామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. కొత్త రేషన్ కార్డులు జారీ చేసిన తర్వాత పథకాలను అమలు చేస్తే ఎక్కువ మందికి లబ్ధి చేకూరుతుందని సూచించారు. రైతుబంధు నిధులను ఇప్పటి వరకు ఎందుకు జమ చేయలేదు? అని ప్రశ్నించారు. రూ.4వేల నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని...ఇప్పుడు దాని గురించి మాట్లాడటం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఓట్ల తేడా కేవలం 2 శాతమేనని, స్వల్ప ఓట్లతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకులది స్వేదపత్రం కాదు.. సౌధపత్రం

- మొదటి పేజి తరువాయి

కల్వకుంట్ల కుటుంబానికి ఆస్తులు పెంచుకున్నరు.' అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఏ అత్త కూడా కొత్త కోడలును ఇరవై రోజుల్లో ఏమీ అనదని, అన్నీ సర్దుకున్నాకే మంచీ చెడు మాట్లాడుతుందన్నారు. అలాంటిది బీఆర్‌ఎస్ నాయకులుమాత్రం స్వేదపత్రం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు మొదలుపెట్టారన్నారు. అది స్వేదపత్రం కాదని కల్వకుంట్ల కుటుంబ సౌధపత్రం' అని విమర్శించారు. మీరు ఎన్నెన్ని బంగ్లాలు కట్టుకున్నరు?ఎన్నెన్ని ఫామ్ హౌజులు ఏర్పాటు చేసుకున్నరు? మీ ఇండ్లకు వందలకోట్ల విలువ ఎట్ల వచ్చింది?' దీనిమీద సౌధపత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పులు చేసి తెలంగాణకు ఆస్తులు పెంచామని గొప్పలు చెప్తున్నారని, వాస్తవానికి తెలంగాణను అప్పుల్లో ముంచి కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు పోగేసుకుందని మండిపడ్డారు. రూ.7లక్షలకోట్ల అప్పులు పెంచి రాష్ట్రాన్ని ఆగంచేశారన్నారు. వాళ్ల ఆస్తులను వందేండ్లు తరగకుండా పెంచుకున్నారన్నాని ఆరోపించారు.

**రెండు రోజుల్లోనే రెండు హామీలు నెరవేర్చినం**

కాంగ్రెస్ పరిపాలన దక్షతతో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని మంత్రి అన్నారు.అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు హామీలను నెరవేర్చామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల వరకు వైద్యం చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఇప్పటివరకు నాలుగు కోట్ల మంది మహిళలు జీరో టికెట్ల మీద ప్రయాణం చేశారని చెప్పారు. ఇంకా కొంత ఫ్రీక్వెన్సీ, ఆక్యుపెన్సి పెంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కొన్ని రూట్లలో బస్సులు కావాల్సి ఉందన్నారు. వాటన్నింటిని సమీక్షించుకొని అన్ని రూట్లలో బస్సులు నడుపుతామని చెప్పారు. బస్సులు ఆలస్యం కాకుండా ప్రయాణికులకు సౌకర్యం కల్పిస్తామన్నారు.

# మార్నింగ్ వాక్ విత్ పబ్లిక్ కార్యక్రమంలో ప్రభుత్వ విప్....

- 'ప్రజాపాలన' కార్యక్రమంపై ఆఫీసర్లతో ప్రభుత్వ విప్ రివ్యూ..
- యాదగిరిగుట్ట మున్సిపాలిటీ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా...
- ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య






**సి కే న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (సంపత్) డిసెంబర్ 27 :**యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం ఉదయం పలు వార్డుల్లో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్ విత్ పబ్లిక్ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు.ముందుగా బిసి కాలనీలోని సబ్ స్టేషన్ సందర్శించారు.అక్కడి ఏఈ తో ఫోన్లో మాట్లాడి పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.అదే విధంగా పలు ప్రాంతాల్లో పెద్ద మోరి వల్ల ప్రజలకు ఎదురుకుంటున్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కి ఆదేశాలు ఇచ్చారు.బీసీ కాలనీ లో ఉన్న పార్క్ ని పరిశీలించారు అక్కడ పలు పనులు నాణ్యతగా లేవని గమనించి,ఆ పనులను నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు.అదేవిధంగా విద్యుత్ లూస్ వైర్లు,ట్రాన్స్ఫార్మర్స్ మరమ్మతులు,ప్రజల కోరిక మేరకు పెద్దమోరి క్లిన్ చేయాలని,ప్రజలందరు ప్రజల పాలన గ్రామ సభల్లో పాల్గొనాని తెలిపారు.అర్హులైన వారందరు ఆరు గ్యారెంటీ లకు అర్జిపెట్టుకోవలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య గారు తెలిపారు.'ప్రజాపాలన' కార్యక్రమంపై ఆఫీసర్లతో విప్ బీర్ల ఐలయ్య రివ్యూ ప్రజాపాలన గ్రామసభ పై అవగాహన కార్యక్రమానికి హాజరైయ్యారు. ఈ అవగాహన కార్యక్రమంలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు,స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య గారు మాట్లాడుతూ 'ప్రజాపాలన' కార్యక్రమం ద్వారా ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజల నుండి దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించారు.'ప్రజాపాలన' ఉద్దేశ్యాన్ని ప్రజలకు వివరించి ఈ నెల 28 నుండి జనవరి 6 వరకు నుండి దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు.ప్రజాప్రతినిధులు, ఆఫీసర్లు సమన్వయంతో పనిచేసి 'ప్రజాపాలన' కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని ఆదేశించారు.

# ప్రజల ఆదరణ పొందుతున్న సర్పంచ్. స్వర్ణలత.భాగ్యరాజ్



**సి కే న్యూస్ చేగుంట రిపోర్టర్ కొండి శ్రీనివాస్ డిసెంబర్ 27:**చేగుంట మండల్ ఛందాయి పేట. గ్రామానికి చెందిన సర్పంచ్ ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం లో ముందుండి ప్రతి పేదవాడికి అమ్మ అంటే నేనున్నానే విధంగా ఆర్థిక సహాయం లో ముందుండి ప్రజల హృదయాల్లో నిలిచిన వ్యక్తిగా సర్పంచ్ రాష్ట్రంలోని నిదర్శనంగా నిలవడం జరుగుతుంది ఈరోజు చేగుంట వస్తవ్య లైన. గిరకల కవిత అబ్బోజిపేట గ్రామంలో చనిపోవడం జరిగింది విషయం తెలుసుకున్న సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్ వారి కుటుంబానికి విమర్శించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ అలానే వారి కుటుంబానికి తనవంతు. ఆర్థిక సహాయం.అందించడం జరిగింది.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులను పరామర్శించిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే.....



**సి కే న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (సంపత్) డిసెంబర్ 27 :**మంగళవారం రోజున రోడ్డు ప్రమాదంలో గాయపడిన మూటకొండూర్ వైస్ ఎం. పి. పి ఇల్లందుల మల్లేష్ గౌడ్,యూత్ నాయకుడు శరత్ ని మరియు సాయిగూడెం కు చేందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆలేటి ఉపేందర్ కుటుంబాన్ని బుధవారం రోజున ఆలేరు మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య గౌడ్ పరామర్శించారు.వారి వెంట ఆలేరు బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు
పుట్ట మల్లేష్ గౌడ్,మార్కెట్ డైరెక్టర్ పత్తి వెంకటేష్,పట్టణ ఉపాధ్యక్షులు బిదాని బాలరాజు,ప్రధాన కార్యదర్శి దయ్యాల సంపత్ సీనియర్ నాయకులు ఎర్ర దేవదానం,పుట్ట పవన్,2 వ వార్డు అధ్యక్షులు కె.రాంచంద్ర రెడ్డి,అందె భరత్,సోషల్ మీడియా కన్వీనర్ బాసాని ప్రశాంత్ వున్నారు..

# ప్రజాపాలన కార్యక్రమం జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్ల తో నిర్వహించి ,ప్రతి ఒక్కరి నుండి దరఖాస్తులు స్వీకరించాలి...





- జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే

**సి కే న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (సంపత్) డిసెంబర్ 27 :**రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం ద్వారా ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లతో నిర్వహించాలని, ప్రతి ఒక్కరి నుండి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు.బుధవారం నాడు కలెక్టరేటు సమావేశ మందిరంలో మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమీషనర్లు,తహాశీలుదార్లు, మండల అభివృద్ధి అధికారులతో రేపు 28 వ తేదీ నుండి జనవరి 6 వ తేదీ వరకు (ప్రభుత్వ సెలవులు డిసెంబరు 31, జనవరి 1 వ తేదీ మినహా) ప్రజాపాలన కార్యక్రమం ద్వారా 6 గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమ ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతుతూ మంగళవారం నాడు ఉమ్మడి నల్లగొండ జిల్లా సమావేశంలో మంత్రివర్యులు ప్రజాపాలన కార్యక్రమ అమలుపై దిశానిర్దేశం చేయడం జరిగిందని, ప్రశాంత వాతావరణంలో ఎలాంటి రద్దీ, హడావుడీ లేకుండా ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించాలని, అందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, రోజుకు రెండు గ్రామాలలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.%ూా% గంటల నుండి సాయంత్రం 6.%ూా% గంటల వరకు గ్రామ సభల ఏర్పాటుతో తగిన కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ఉదయం 8.%ూా% గంటలకు కార్యక్రమం ప్రారంభించి ముఖ్యమంత్రి గారి సందేశాన్ని చదివి వినిపించాలని తెలిపారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు స్వీకరించాలని, దరఖాస్తులో ఉన్న 5 పథకాలపై కూడా ఒకే దరఖాస్తు ద్వారా స్వీకరించాలని తెలిపారు. ఐదు గ్యారెంటీ పథకాలపైనే కాకుండా ఇతర అంశాలపై కూడా దరఖాస్తులు ఇస్తే స్వీకరించాలని, తప్పనిసరిగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి వ్రాయడం రాని వారికి దరఖాస్తులు వ్రాసే విధంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, దరఖాస్తులు స్వీకరణలో వృద్ధులకు, దివ్యాంగులకు తగిన ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. దరఖాస్తు స్వీకరించిన తదుపరి వెంటనే రశీదు ఇవ్వాలని తెలిపారు. గ్రామ సభకు ఎవరైనా రాలేకపోతే జనవరి 6 వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయం, గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఒక కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని,దరఖాస్తులు స్వీకరిస్తారనే విషయాన్ని ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.గ్రామ సభలో తగిన ఏర్పాట్లు చేయాలని, మైక్ ఏర్పాట్లు,టెంట్, కుర్చీలు, టేబుల్స్, క్యూలైన్ బారికేడింగ్స్, దరఖాస్తులు, మంచినీటి సౌకర్యం తదితర వసతులు కల్పించాలని తెలిపారు.జీరాక్సు సెంటర్ల యజమానులు దరఖాస్తుల జీరాక్సు కొరకు ఎక్కువ రుసుము వసూలు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏరోజు రిపోర్టు ఆ రోజు సాయంత్రం లోగా నిర్ణీత ప్రొఫార్మాలో నివేదికలు సమర్పించాలని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం తిరిగి నాలుగు నెలలకోసారి నిర్వహించడం జరుగుతుందని, ప్రభుత్వ పథకాలను పొందేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్లు రేపు జరుగబోయే గ్రామ సభలకు సంబంధించిన ఏర్పాట్లను ముందు రోజే వెళ్లి పరిశీలించుకోవాలని, సాఫీగా దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లను పర్యవేక్షించాలని, టామ్ టామ్, ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలిసేలా కార్యాచరణ ఉండాలని తెలిపారు.సమావేశంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు ఏ.భాస్కరరావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు జి.వీరారెడ్డి, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, జిల్లా పరిషత్ సిఇఓ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ పోలీసు కమీషనర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో 30% నిధులు విద్యారంగానికి కేటాయించాలి





- ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు బుర్రు అనిల్
- సహాయ కార్యదర్శికాసుల నరేష్

**సి కే న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (సంపత్) డిసెంబర్ 27 :**బుధవారం రోజున ఆలేరులో ఎస్.ఆర్,వి.ఆర్ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా విద్యారంగం సమస్యలతో సతమతమవుతున్నదని,సంక్షేమ వసతి గృహాలు,గురుకులాలు,కేజీబీవీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.గత రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచామని ప్రకటించిన అవి అమలు కావడం లేదు.గత సంవత్సర కాలం నుండి హాస్టల్ మెస్ బిల్లులు కూడా పెండింగ్లో ఉన్నాయని,పెండింగ్లో ఉన్న 772 కోట్ల స్కాలర్షిప్ మరియు ఫీజు రింబెర్స్మెంట్ విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో 30% నిధులు విద్యారంగానికి కేటాయించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కందుల నాగరాజ్,ఉపాధ్యక్షులు కంతి విక్రంసభ్యులు ముప్పు రుతికేశ్వర్ రెడ్డి,పుట్టల ఉదయ్,కాముని ప్రణయ్, కంతి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రజా పాలన అభయ హస్తం గ్యారంటీ ల దరఖాస్తుల స్వీకరణ.

**అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి.**



**సి కె న్యూస్ సత్తుపల్లి ప్రతినిధి మునీర్.**స్థానిక మున్సిపల్ ఆఫీస్ లో సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ,స్పెషల్ ఆఫీసర్ సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అభయ హస్తం గ్యారంటీ ల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ను 28-12-23 నుండి 06-01-2024 వరకు జరుగునని ఈ దరఖాస్తు లు మహా లక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు,గృహ జ్యోతి, చేయూత గ్యారంటీ పథకాల అమలు కొరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు మేరకు అర్హులు గల ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించబడును అని సత్తుపల్లి మున్సిపల్ పరిధిలో ని అన్ని వార్డు ల్లో అధికారులు తీసుకోవలిసిన జాగ్రత్తలు, దరఖాస్తు స్వీకరణ నియమాలు, ప్రణాళికలు గురించి అధికారులతో చర్చించి, సమావేశం నిర్వహించినారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ లో ప్రతిష్టాత్మకంగా చెప్పట్టిన ప్రజా పాలనా ఎటువంటి పక్ష పాతం లేకుండా అందరి దరఖాస్తులు స్వీకరించాలి అని తెలిపారు.ప్రజా పాలనా కార్యక్రమం లో ప్రజలకు అన్ని వసతులు అనగా టెంట్లు, నీరు సదుపాయం ఏర్పాటు చెయ్యాలి అని ఆదేశించారు.వృద్ధులు, వికలాంగుల, గర్భిణీ లు పట్ల ప్రత్యేక ఏర్పాటు చెయ్యాలి అని ఆదేశించారు. ఈ సమావేశం లో మున్సిపల్ చైర్మన్ కొసంపూడి మహేష్ , వైస్ చైర్మన్ తోట సుజాల రాణి ,మున్సిపల్ కమిషనర్ సుజాత , ఎమ్ ఆర్ ఓ శివ కేశవ రావు, కౌన్సిలర్స్ పద్మ జ్యోతి మందపాటి, షేక్ నాగుల్ మీరా, దూదిపాళ్ళ రాంబాబు, గ్రాండ్ మౌలాలి మున్సిపల్ పలువురు పాల్గొన్నారు.



# కామ్రేడ్ కేవల్ కిషన్ 63 వ వర్ధంతి.పోలంపల్లిలో



**సి కే న్యూస్ చేగుంట రిపోర్టర్ కొండి శ్రీనివాస్ డిసెంబర్ 26 :**చేగుంట మండలం పొలంపల్లి గ్రామ శివారులో కామ్రేడ్ కేవలం కిషన్ 63 వ వర్ధంతిని వారి కుటుంబ సభ్యులు,ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా వచ్చిన తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్. రావడం జరిగింది వారు మాట్లాడుతూ ప్రజలంతా కేవల్ కిషన్.తన మరణాన్ని జ్ఞాపకాలతో. పాటల రూపంలో దేవునిలా పూజిస్తూ జ్ఞాపకంగా పొలంపల్లి గ్రామ శివారులో జాతర జరుపుకునే మహా వ్యక్తి కామ్రేడ్ కేవల్ కిషన్ అని,తెలంగాణ సాయుధ పోరాటంలో అగ్నికనమని, నెత్తుటి అక్షరాలతో రాయబడ్డ చరిత్ర ఆయనదని, రజాకర్లకు ఎదురొడ్డి పోరాడిన వీరుడు అని, జాగీరుదారుల,పెత్తందారుల పాలిట సింహస్వప్నంగా, వెట్టిచాకిరి విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసి భూస్వాములను గడగడలాడించి పేద ప్రజలకు భూములు పంచి వారి గుండెల్లో ఊపిరిగా మారిన ప్రజానాయకుడు అని, ఆయన పోరాటపతిమను కొందరు భూస్వాములు,పెత్తందారులు ఆయనను రోడ్డు ప్రమాదంలో చంపి నేటికి 63 ఏళ్ల అయిందని,ఆయన స్మృతి వనం కోసం అటవీశాఖ చట్టాలు కఠినంగా ఉన్నా అప్పటి అటవీశాఖ మంత్రి జోగురామన్నను ఒప్పించి పొలంపల్లి శివారులో ఒక ఎకరా భూమి ఇప్పించానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు మానేగాళ్ల రామకిష్టయ్య,కామారెడ్డి జిల్లా అధ్యక్షులు విట్టల్, వైద్యవిధాన పరిషత్ మాజీ కమిషనర్ వీణ,ఆయన కుటుంబ సభ్యులతో పాటు,ముదిరాజ్ నాయకులు పెద్ద ఎత్తున చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల జీవితాలు మారాలంటే ఏఐటీయూసి నీ గెలిపించండి.

- కొత్తగూడెం ఎమ్మెల్యే కోనమినేని సాంబశివరావు.



**సీకే న్యూస్ సత్తుపల్లి ప్రతినిధి మునీర్.** సింగరేణి ఎన్నికల సందర్భంగా కొత్తగూడెం శాసనసభ్యులు కోనమనేని సాంబశివరావు పాల్గొన్నారు సాంబశివరావు మాట్లాడుతూ సింగరేణి పరిరక్షణ ఏఐటీయూసీ ధ్యేయం సింగరేణిని ధ్వంసం చేసిన పాలకులు పాలకవర్గానికి తొత్తు సంఘాలను ఓడించండి అని గత 82 సంవత్సరాలుగా గెలుపు ఓటమితో సంబంధం లేకుండా సింగరేణి రక్షించడమే ధ్యేయంగా ఏఐటీయూసీ పనిచేస్తుందని ఈ ఎన్నికల్లో సింగరేణిలో ఏఐటీయూసీని గెలిపించడం ద్వారా సింగరేణి కాపాడుకోవాలని కొత్తగూడెం శాసనసభ్యులు కామ్రేడ్ కూనమనేని సాంబశివరావు అన్నారు.
సింగరేణి కాలిస్ కంపెనీ ఏర్పడిన నాటి నుండి కార్మికుల హక్కుల కోసం కార్మికులకు అనేక చట్టాలు తీసుకొచ్చిన చరిత్ర ఏఐటీయూసీదని టీబీ విట్టల్ రావు ఆనాటి శేషగిరిరావు కొమరయ్య మహేంద్ర బొల్లెద్దుల ఆనందం ఎందరో త్యాగధనుల రక్తంతో అనేక హక్కులు చట్టాలు సాధించుకున్న చరిత్ర ఏఐటి యు సిది మాత్రమేనని ఈనాడు టిఆర్ఎస్ అనుబంధంగా ఉన్న టీబీజీకేఎస్ సంఘం ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత సింగరేణి సంస్థను ధ్వంసం చేసిందని 60 వేల కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడి కార్మికులకు కనీసం వేతనాలు ఇచ్చే స్థితిలో లేకుండా పోయిందని బోనస్తులు ఇంక్రిమెంట్లు వేతనాలు ఏది సకాలంలో ఇచ్చే పరిస్థితి లేదని వేల కోట్ల లాభాలు అర్జిస్తున్న సింగరేణి కంపెనీ జీతభత్యాల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు .ఈ పరిస్థితి పోవాలంటే కార్మిక హక్కులు రావాలంటే కార్మిక చట్టాలు రావాలంటే కార్మికులకు మెరుగైనటువంటి జీవితం అందించాలంటే ఈ సింగరేణి ప్రైవేటీకరణ జరగకుండా చూడాలంటే కేవలం ఏఐటి యు సి కి మాత్రమే సాధ్యమని కాబట్టి కార్మిక వర్గం విజ్ఞతతో ఆలోచించి నక్షత్రం గుర్తు మీద ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు సత్తుపల్లి లో జరిగిన ఈ ఈ కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాదు ఏఐటీ యు సీ రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరావు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శివరామకృష్ణ రామాంజనేయులు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు సింగరేణి కాలనీస్ వర్కర్స్ సెంట్రల్ కమిటీ సభ్యులు జివిఆర్ స్వామి సిపిఐ సత్తుపల్లి మండల కార్యదర్శి యోబు సిపిఐ సత్తుపల్లి పట్టణ కార్యదర్శి రామకృష్ణ సింగరేణి సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ వైస్ ప్రెసిడెంట్ భీమయ్య జేవియర్ ఓసి ఫిట్ సెక్రెటరీ గోదా నరసింహారావు దమ్మాలపాటి నరసింహారావు కాగితం వెంకటేశ్వర్లు చారి కోన వెంకటేశ్వర్లు శ్రీనివాసరావు కల్లూరు మండల కార్యదర్శి ధమాల్ దయాకర్ వేము రాంబాబు రామలక్ష్మి నారాయణరావు వేంసూరు సిపిఐ మండల నాయకులు షేక్ లాల్ మహమ్మద్ పోలేటి వెంకటేశ్వర్లు వెంకటమ్మ తాటి వీరభద్రం సిపిఐ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన ఎస్సి సెల్ మండల అధ్యక్షులు మేడి శ్రీనివాస్



**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్**
బిఆర్ఎస్ పార్టీ ఎస్సి సెల్ మండల అధ్యక్షులు మేడి శ్రీనివాస్ పార్టీకి పదవికి రాజీనామా చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేను పార్టీ కోసం కష్టపడ్డాను కానీ నేను ఎలాంటి లబ్ధి పొందలేదు ఆర్థిక స్థోమత కూడా లేదు ఇల్లు లేదు నాకు ఏమీ లేదు నన్ను ఆదుకునే వాళ్ళు ఎవరూ లేరు నేను అనారోగ్యనికి గురైతే ఆదుకునే నాయకుడు లేడు బిఆర్ఎస్ పార్టీలో జెండాలు మోపించి జేజేలు కొట్టించే వాళ్ళు అవసరానికి వెంట తిప్పుకునే వాళ్ళు నాయకుడు కాదు ఎందుకంటే నేను నాయకుడిలా పని చేయలేదు సేవకుడిలా పని చేశాను యుద్ధానికి సిద్ధమయ్యాను కాంగ్రెస్ ను ఓడ కొట్టి బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ని గెలిపించుకున్నాను కానీ నాకు ఎవరూ ఏమి చేయలేదు గృహలక్ష్మి అని ఒక సర్టిఫికెట్ ఇచ్చి నాకు ఇల్లు కూడా రాలేదు అదే నీకు ఇల్లు అని అన్నారు కానీ బిఆర్ఎస్ పార్టీ నుండి నాకు ఏ పథకాలు నాకు అందలేదు ఎందుకంటే ఇవన్నీ గుర్తు చేసుకున్న ప్రతిసారి నేను మానసికనికి గురైతుఉన్న బిఆర్ఎస్ పార్టీ ఎస్సి సెల్ ఆత్మకూరు మండల అధ్యక్షులుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమలు ప్రతిఒక్కటి విజయవంతం చేసిన అయినా పార్టీ నన్ను గుర్తించలేదు కావున బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్న కావున ఈరోజు నుండి పార్టీకి నాకు ఎలాంటి సంబంధం లేదు

## కుంభం అనిల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వలిగొండ మండలం నాయకులు



**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు డిసెంబర్ 27.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని మండల నాయకులు జిల్లా నాయకులు రాష్ట్ర నాయకులు ఈరోజు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నివాసములో మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువాతో సన్మానం చేసి పుష్ప బోకే అందించి శుభాకాంక్షలు తెలిపినారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పైళ్ల రాజ వర్ధన్ రెడ్డి జిల్లా నాయకులు చెరుకు శివయ్యగౌడ్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు శివశాంతి రెడ్డి సత్తిరెడ్డి సోలిపురం సాగర్ రెడ్డి సంజీవరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజా పాలనపై మంత్రులు దామోదర రాజానర్సింహ, జూపల్లి కృష్ణారావు ల సమీక్ష





- ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రులు
- నేటి నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం
- ప్రజా పాలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చిన మంత్రులు
- వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర రాజా నర్సింహ
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**సీ కే న్యూస్ ప్రతినిధి, కొల్లాపూర్ :** ఇటీవల కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగమంతా సమాయాత్తం కావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర రాజా నర్సింహ, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర రాజా నర్సింహ, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రజా పాలనపై బుధవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సముదాయ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో ప్రజా పాలన, ఆరు గ్యారెంటీల అమలుపై సమీక్ష నిర్వహించారు ఆరు గ్యారెంటీల అమలులో చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికను రూపొందించిందని, వాటిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించేందుకు, దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతీ ప్రాంతానికి సంబంధిత శాఖల అధికారులు వెళ్లి ప్రజలకు ఇబ్బంది కలగకుండా దరఖాస్తులు తీసుకోవాలని దిశానిర్ధేశం చేశారు

అనంతరం మంత్రి దామోదర రాజానర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల రూపకల్పన, విధివిధానాలను ప్రభుత్వం రూపొందిస్తే వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత అధికారులపై ఉంటుందనీ అంతిమ లబ్ధిదారులు ప్రజలేననీ అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందినప్పుడే సార్ధకత చేకూరుతుంది అందులో భాగంగానే కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఆరు గ్యారంటీల అమలుకు ప్రజా పాలన కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది మంత్రి జూపల్లి మాట్లాడుతూ యావత్ తెలంగాణ ప్రజలు సంగటితమై కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆరు గ్యారంటీల అమలుకోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన కారక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రతీ ఇంటికి వెళ్లి దరఖాస్తు తీసుకోవాలి. సోషల్ మీడియా, మీడియా, సినిమా థియేటర్లలో ప్రదర్శన, చాటింపు ద్వారా ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలి ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలి. పోలీస్ యంత్రాంగం కూడా ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలి. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు ఉమ్మడి జిల్లాలోని కొంతమంది అధికారులు తమ పనితీరును మార్చుకోవాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్య ధోరణిని వీడాలని మంత్రి జూపల్లి హితవు పలికారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు




## ప్రశాంతంగా కొనసాగిన సింగరేణి ఎన్నికల పోలింగ్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 27,**
సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. మొత్తం 11 డివిజన్లలో బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది.
పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. మధ్యాహ్నం 12 గంటల వరకు 23,623 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. మొత్తం 39,775 ఓట్లు.ఈ ఎన్నికల్లో 13 కార్మిక సంఘాలు బరిలో ఉన్నాయి. సింగరేణి విస్తరించి ఉన్న పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 84 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.700 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు.ఇక పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.
బుధవారం రాత్రి 7 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించి, పూర్తయిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తామని సింగరేణి ఎన్నికల అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు.

## పురుషోత్తపట్నంలో ఘనంగా రాములవారి రాపత్తు ఉత్సవం.



**సీ కే న్యూస్ ఏటపాక ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 27,** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి అధ్యయనోత్సవాలలో భాగంగా బుధవారం పురుషోత్తపట్నం లోని నమ్మక మండపం వద్దకు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు రావలసి ఉండగా, ఆలయ ఈవో రమాదేవి నిరాకరించారు . అటువంటి క్రమంలో పురుషోత్తపట్నంలోని ప్రజలందరూ కూర్చొని ఒక నిర్ణయం తీసుకొని వాళ్ల ఊరిలోనే ఉన్న రాముల వారి ఉత్సవ విగ్రహాలను రాపత్తు సేవ లో ఘనంగా రంగవల్లికల మధ్యలో నుంచి టపాసులు పేలుస్తూ జైశ్రీరామ్ అని పలుకుతూ భక్తుల యొక్క నినాదాలతో ఊరేగింపుగా సెయింట్ ఆన్స్ స్కూల్ జంక్షన్ దగ్గర నుంచి వేస్ట్ ల్యాండ్ మీదుగా పురుషోత్తపట్నం రామాలయానికి తీసుకువెళ్లారు . అనంతరం అక్కడ ఘనంగా స్వామి వారికి పూజలు నిర్వహించి, సంస్కృతిక కార్యక్రమాలను కూడా భక్తుల కొలహాలు మధ్య నిర్వహించారు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న ఇద్దరు పిల్లలకు ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి సాలువాతో సత్కరించారు అనంతరం భక్తులందరూ. కూడా తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పెసా గ్రామ సభల ద్వారానే ఆరు గ్యారంటీల ఎంపిక జరగాలి

ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,న్యాయ వాది వాసం నాగరాజు



**సీకే న్యూస్ ములుగు జిల్లా వెంకటాపురం మండల ప్రతినిధి ప్రశాంత్.డిసెంబర్27.**
ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం మండలంలోని ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతం లో పెసా గ్రామ సభల ద్వారానే అభివృద్ధి జరగాలని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ న్యాయవాది వాసం నాగరాజు అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ప్రభుత్వం చేపట్టే ఆరు గ్యారంటీల విషయం లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పెసా గ్రామ సభల ద్వారానే జరగాలని ఆయన పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారులు పెసా చట్టం పైన సంపూర్ణ అవగాహన కలిగి వుండలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీల పథకాలు ఏజెన్సీ చట్టాలకు విరుద్దంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఏజెన్సీ ప్రాంతాలలో ప్రభుత్వ పరిపాలన రాజ్యాంగ బద్దంగా జరగడంలేదని వాపోయారు.రాష్ట్ర ప్రభుత్వం రూపొందిచించే సంక్షేమ పథకాలు ఏజెన్సీ ప్రాంత చట్టాలకు లోబడి ఉండాలన్నరు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం నుండి గతంలో గిరిజనేతరుడు ఇంటి పన్ను ఇవ్వాలని హై కోర్ట్ ను ఆశ్రయించగా అప్పటి హై కోర్ట్ ప్రధాన న్యాయ మూర్తి నవీన్ రావ్ షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనేతరులకు ఇంటి పన్నులు ఇవ్వరాదని వ్యాఖ్యానించినట్లు గుర్తు చేసారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన గృహ లక్ష్మి పథకం ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘించే విధంగా ఉందని తెలంగాణ న్యాయస్థానం నిలుపుదల చేసినట్టు ఆయన తెలియజేశారు. కేసు నెంబర్ 29444/ 2023 అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో పంచాయితీ అధికారులు సాధారణ గ్రామ సభలను నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రభుత్వం ఏజెన్సీ చట్టాలను నిర్వీర్యం చేసినట్టుగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేయాలని చూడటం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే ప్రతి సంక్షేమ పథకం పైన గిరిజన సలహా మండలి లో ముందుగా చర్చ జరగాలని తెలిపారు. గిరిజన సలహా మండలి ఆదేశాల ప్రకారమే గిరిజన ప్రాంతాల్లో సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. గిరిజన సలహా మండలి ని సత్వరమే ఏర్పాటు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో అట్టం లక్ష్మయ్య, శివ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కు ఘనంగా సన్మానం..



**సి కే న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (సంపత్) డిసెంబర్ 27 :** తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కి శాలువాతో సన్మానం చేయనైనది .అనంతరం వారికి పెన్షనర్ల సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేయనైనది .ముఖ్యంగా ,ఆలేరు నియోజకవర్గం స్థాయిలో ఒక విశ్రాంతిభవనం ఏర్పాటు చేయాలని మరియు ప్రతినెల ఒకటో తేదీన పెన్షన్లు అందేటట్లు కృషి చేయుటకు అసెంబ్లీలో చర్చించాలని కోరనైనది.ఈ సన్మాన కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి బాలరాజు,పి.రాజయ్య ,జి.రామచంద్రయ్య ,వి.ఆనందం,, ఎం డి.అలీముద్దీన్,,డి.నరసయ్య ,వి.యాదగిరి,జి.లక్ష్మీనారాయణ ఎం.యాదగిరి ,కే .సత్తయ్య తదితరపెన్షనర్లు పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కు సన్మానం...





**సి కే న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (సంపత్) డిసెంబర్ 27:**సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆలేరు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే గా గెలిచి ప్రభుత్వ విప్ గా నియమైన సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో అభినంద సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా అధ్యక్షుడు గోదాశ్రీరములు బీర్ల ఐలయ్య కు సన్మానించారు.ఈ సంధర్భంగా బీర్ల ఐలయ్య%ఎ%మాట్లాడుతూ..నేడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కోసం మీ పొత్తు తో,మీరు అందిచిన సహకారం గత ప్రభుత్వన్నీ దించేందుకు.ప్రజా ప్రభుత్వన్నీ ప్రజాపాలనను నెలకొల్పేందుకు కాంగ్రెస్ పార్టీ చేతికి కొడవలి అందించిన కమ్యూనిస్టు సోదరులకు హృదయకపూర్వక ధన్యవాదాలు తెలిపారు.నేడు ఆలేరు లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం నాతో కలసి అహర్నిశలు కష్టపడిన కామ్రేడ్ సోదర సోదరిమనులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సాయుధపోరాటం లో భూమి కోసం భుక్తి కోసం ధోరలనుండి ప్రజలకు విముక్తి కోసం కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా తెలంగాణ గడ్డకు స్వాతంత్రం వచ్చిందని మల్ల ఇదే కమ్యూనిస్టులతో కాంగ్రెస్ పార్టీ చేయి కలిపి ఈ దొంగ ధోరలను అధికారంలో నుండి దించి ప్రజాపాలన కొసం ప్రజాప్రభుత్వాన్ని సాధించిమని, కమ్యూనిస్టులు కాంగ్రెస్ ఇదే ఐక్యతతో కలిసిమెలిసి పోరాడి దేశం లో కూడా బిజెపి ని దించాల్సి ప్రజాప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.మన మిత్రపక్షంలో భాగంగా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సహకారం కమ్యూనిస్ఠులకు ఉంటుందని హామీ ఇస్తున్నాం...మీకు అన్ని విధాలుగా సహకరిస్తామని,మీరు ఏ సమస్యలు ఉన్నా నా దృష్టికి తీసుకొని వస్తే తప్పకుండ పరిష్కరిస్తామని తెలిపారు.యాదగిరిగుట్ట అభివృద్ధి కి కృషి చేసి పలుగు పార బట్టి అనాలోచిత బ్రిడ్జి తొలగిస్తామని తెలిపారు.ఆటో కార్మికుల సమస్యను కూడా కొద్దిరోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.

# ఎల్ల గౌడ్ పార్థివ దేహానికి నివాళులర్పించిన గాదెల సుధారాణి రత్న ప్రభాకర్ రెడ్డి

**గాదెల సుధారాణి రత్న ప్రభాకర్ రెడ్డి**



**సీ కే న్యూస్ ప్రతినిధి కొల్లాపూర్ :**కొల్లాపూర్ మండలం మాచి నేనిపల్లి గ్రామానికి చెందిన తమటం ఎల్ల గౌడ్ అనారోగ్యంతో బాధపడుతు మరణించారు ఇట్టి విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ గాదెల సుధారాణి రత్న ప్రభాకర్ రెడ్డి వారి ఇంటికి వెళ్ళి తమటం ఎల్ల గౌడ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి దైర్యం చెప్పారు ఆయన ఆత్మకుశాంతి చేకూరాలని ఆ భగవంతుడ్ని ప్రార్థిస్తూ వారి కుటుంబసభ్యులకు తన ప్రగాడ సానుభూతిని తెలియజేసారు

# రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్న బెల్టు షాపులపై, నూతన సీ.ఎం నిర్ణయం సరైనదేనా..?





**"ఒకవేళ అదే జరుగుతే కాంగ్రెస్ ప్రభుత్వ నిరంతర పాలన ఖాయం అంటున్న తెలంగాణ మహిళలు,"**

**"ప్రభుత్వ ఆదేశాలతో నియమించబడ్డ మద్యం దుకాణాలలో కొన్ని ఆంక్షలు ఉంటాయి..!"**

**"మద్యం సిండికేట్ ప్రోత్సాహంతో నియమించబడ్డ బెల్ట్ షాపుల పరిస్థితి ఏమిటి..?"**

**"రోడ్డు ప్రమాదాలకు బెల్ట్ షాపుల సమయ అనుకూలతే కారణమా..?"**

**"కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమలు చేస్తారా. "లేక" గత ప్రభుత్వం లానే దాటేస్తారా..?"**

**"ములుగు జిల్లా సి కె న్యూస్ ప్రతినిధి భార్గవ్"**కొన్ని ప్రాంతాలలో మద్యం సీసాల పై అధిక వసూళ్లు కేవలం ఒక్క బీరుకే వైన్ షాపులో 20 రూపాయలు పేచ్చు, బెల్ట్ షాపులో 40 రూపాయలు పేచ్చు ఇదెక్కడి అన్యాయం అని ప్రశ్నించిన మద్యం ప్రియులకు యాజమాన్యం ఇచ్చే సమాధానం మొత్తం మాకే ఉంటాయా..? తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్రానికి ఆర్థికంగా వసూళ్లు అందించే, వాటిలో ముందున్నదే మద్యం సిండికేట్ సమస్త. అని ప్రభుత్వాల అంచనా, కానీ తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతుంది కూడా అదే మద్యం సిండికేట్ అని గుర్తించినదే" కాంగ్రెస్ ప్రభుత్వం. నూతనంగా తెలంగాణ పాలక సీ.ఎం కూర్చుని అధిష్టించిన తెలంగాణ సీ.ఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలకు సీనియర్ నాయకులైన సరే తలవంచాల్సిందే అన్నట్టుగా. సీ.ఎం రేవంత్ రెడ్డి పనితీరు. ప్రభుత్వ పాలన అంటే ఆదాయం కోసం పనిచేసేది కాదు. ప్రజల అవసరాలను గమనించి పని చేయాలి అంటూ పలికారు అంతేకాకుండా ప్రభుత్వాలు మారితే కానీ తెలంగాణ ప్రజల బ్రతుకులు చక్కబడవని ప్రజలే నిర్ణయం తీసుకొని అధికారం మాకు ప్రజలే అందించారు. ప్రజల నమ్మకాన్ని మేము ఒమ్ము కానివ్వం అవసరమైతే ప్రజల శ్రేయస్సు కోసం ఆర్థిక ఆదాయాన్ని కూడా వదులుకుంటాం. హామీలలో పలికిన ఆరు గ్యారెంటీలతోపాటు ప్రజల సౌకర్యం కోసం మరెన్నో కీలక నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్నది అని అసెంబ్లీలో రేవంత్ రెడ్డి స్పష్టంగా తెలిపారు. గుడి, బడి అని తేడా లేకుండా రాత్రి, పగలు, అని చూడకుండా బెల్ట్ షాపులలో మద్యం విక్రయాలు జోరుగా జరగడం వలనే రోడ్డు యాక్సిడెంట్లకు కారణం. అంతేకాకుండా ప్రభుత్వం ద్వారా నియమించబడ్డావు మద్యం దుకాణాలలో కొన్ని ఆంక్షలు ఉంటాయి కానీ, వైన్స్ సిండికేట్ ప్రోత్సాహంతో నియమించబడ్డ బెల్ట్ షాపులలో వయసుతో పని లేకుండా. అక్రమ సంపాదన కోసం జోరుగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి ఇలాంటి అక్రమాలను అడ్డుకోవాల్సిన పాలక ప్రభుత్వమే గత పాలనలో మామూళ్ల మత్తులో మునిగితేలుతూ ఉండడం వల్లే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెల్ట్ షాపుల వీరంగం నడుస్తుంది అంటూ ప్రజాస్వామ్యంలో పలు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

# నున్నా రామకృష్ణను పరామర్శించిన అన్నారుగూడెం కాంగ్రెస్ నాయకులు



**ఖమ్మం జిల్లా తల్లాడ మండలం సీకే న్యూస్ రిపోర్టర్ : విజయ్ డిసెంబర్ :27:** సత్తుపల్లి నియోజకవర్గంలోని లంకపల్లి గ్రామానికి చెందిన ఆత్మ కమిటీ డైరెక్టర్ నున్న రామకృష్ణ మాతృమూర్తి లక్ష్మిదేవి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అన్నారుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం లంకపల్లిలో నున్న రామకృష్ణను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మారెళ్ళ మల్లికార్జునరావు, యల్లంకి వెంకటేశ్వరరావు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్ తదితరులు ఉన్నారు.

# ఉగ్గేబిక్షపతి కుటుంబానికి 1993-94 ఎస్ఎస్ సి బ్యాచ్ మిత్రులు హార్దిక సహాయం



**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :**అనారోగ్యంతో చనిపోయిన ఉగ్గే బిక్షపతి కుటుంబానికి ఎస్ ఎస్ సి 1993-94 బ్యాచ్ మిత్రుల ఆర్థిక సహాయం 40.000 ఈ కార్యక్రమంలో హాజరైన మిత్రులు %జూ% జహంగీర్ గౌడ్ ఎస్ పురుషోత్తం రెడ్డి ఎల్ సుమలత కే శ్రీశైలం టి ఎల్ల స్వామి పి వెంకట్ రెడ్డి వీ నర్సయ్య ఎద్దు బ్రదర్స్ వెంకటేశ్వర్లు శ్రీను తదితరులు పాల్గొన్నారు

# అధిక లోడుతో.. బస్సు ఓనర్లకు నష్టం

- బస్సు బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఇన్సూరెన్స్ వర్తింపజేయాలి
- టైరు, కిలోమీటర్ ధర పెంచాలి
- తెలంగాణ అద్దె బస్సుల యజమానుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరకాంతం మహిపాల్ రెడ్డి



**సి కె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్) డిసెంబర్ 27:**అధికలోడు కారణంగా అద్దె బస్సుల యజమానులకు తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతుందని.. ఆర్టీసీ బస్సుల కేఎంపిఎల్ ను, ఎక్స్ ప్రెస్, పల్లె వెలుగు బస్సులకు 4.5కేఎంపిఎల్ గా తగ్గించాలని.. లేకపోతే అద్దె బస్సులు నడపలేమని తెలంగాణ అద్దె బస్సుల యజమానుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరకాంతం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర అద్దె బస్సుల యజమానుల సంఘం అధ్యక్షుడు అబ్బ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లగిరి శివారులోని రిక్కల సత్తిరెడ్డి ఫంక్షన్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర అద్దె బస్సుల యజమానుల సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం వల్ల అద్దె బస్సుల యజమానులు పడుతున్న ఇబ్బందులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వరకాంతం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల కే ఎం పి ఎల్ ను, ఎక్స్ ప్రెస్, పల్లె వెలుగు బస్సులకు 4.5కే ఎం పి ఎల్ గా తగ్గించాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం వల్ల అద్దె బస్సుల్లో సామర్థ్యానికి మించి 120మందిని ఎక్కిస్తున్నారని, తద్వారా బస్సుల జీవితకాలం తగ్గే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల్లో పరిమితికి మించి ఎక్కువ మంది ప్రయాణించడంతో, ఆ బస్సులు త్వరగా చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. తో అద్దె బస్సుల యజమానులపై ఆర్థిక భారం పడుతుందని, కావున ప్రస్తుతం ఇస్తున్న ధర కన్నా రూ.3లు అధికంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామర్థ్యానికి మించి అధికలోడుతో ప్రయాణించడం వల్ల టైర్లు త్వరగా అరిగిపోతున్నాయని, టైర్లు కూడా ఆర్టీసీ వారికి ఎంత ధరకు ఇస్తున్నారని, తమకు కూడా తైరు కిలోమీటర్ ధర పెంచాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలన్నీ ఎలాంటి పరిష్కారానికి నోచుకోలేదని, అయినను హైదరాబాదులో టెండర్లు పిలిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులలో అద్దె బస్సుల యజమానులం బస్సులు నడపలేమని స్పష్టం చేశారు. 2024జనవరి 5వ తేదీ నుంచి ఆర్టీసీ సంస్థకు బస్సులు నడపమని పత్రిక ముఖంగా తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అద్దె బస్సుల యజమానుల సంఘం కోశాధికారి ఎం సత్తిబాబు, అద్దె బస్సుల యజమానుల సంఘం రాష్ట్ర కార్యవర్గం శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, రంగారెడ్డి, జలంధర్ రెడ్డి, వి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు ఇది అద్భుతమైన అవకాశం సద్వినియోగం చేసుకోండి- సీఐ బండారి కుమార్



**సీకే న్యూస్ ములుగు జిల్లా వెంకటాపురం మండల ప్రతినిధి ప్రశాంత్. డిసెంబర్ 27.**ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం మండలంలోని రాష్ట్ర ప్రభుత్వం వాహనదారులకు ఓ అద్భుతమైన అవకాశం ఇచ్చిందని ఈ అవకాశాన్ని వినియోగించుకొని మీ వాహనాలపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కింద విధించిన చలాన్ల చెల్లింపులలో భారీ రాయితీ ప్రకటించిందని మీ వాహనాలపై పెండింగ్ లో ఉన్న చలాన్లను చెల్లింపునకు జనవరి 10 వరకు సమయం ప్రకటించిందని వాహనదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓ ప్రకటనలో వెంకటాపురం సిఐ బండారి కుమార్ సూచించారు.

# సింగరేణి ఎన్నికల ప్రచారంలో భద్రాచలం నాయకత్వం.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),డిసెంబర్ 27,**సింగరేణి గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భద్రాచలం పట్టణానికి చెందిన సిఐటియు నాయకత్వం చురుగ్గా పాల్గొని సిఐటియు విధివిధానాలను కార్మికులకు తీసుకెళ్లడంలో కృషి చేశారు. ఎన్నికల ప్రచారంలో వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు నాయకులు గడ్డం స్వామి ఎర్రంశెట్టి వెంకట రామారావు భూపేంద్ర అజయ్ కుమార్ తదితరులు పాల్గొని కార్మిక సమస్యలపై పోరాడే సిఐటిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వ్యాకాస నాయకులు గడ్డం స్వామి మాట్లాడుతూ సిరుల తల్లి సింగరేణిని పాలకులు స్వలాభం కోసం ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గతంలో గెలిచిన గుర్తింపు సంఘాలు ఏవి కూడా పట్టనట్టు వ్యవహరిస్తున్నాయని అన్నారు. భవిష్యత్తులో కార్మిక సంక్షేమం కోసం సిఐటియు నీ గెలిపించాలని కోరారు.



# పెసా గ్రామ సభల ద్వారానే ఆరు గ్యారంటీల ఎంపిక జరగాలి

- "ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,న్యాయ వాది వాసం నాగరాజు"
- "ఆదివాసి చట్టాలకు భంగం కలిగిస్తే సహించేదే లేదు"



**"ములుగు జిల్లా సీకే న్యూస్ ప్రతినిధి భార్గవ్"** ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతం లో పెసా గ్రామ సభల ద్వారానే అభివృద్ధి జరగాలని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ న్యాయవాది వాసం నాగరాజు అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ప్రభుత్వం చేపట్టే ఆరు గ్యారంటీల విషయం లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పెసా గ్రామ సభల ద్వారానే జరగాలని ఆయన పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారులు పెసా చట్టం పైన సంపూర్ణ అవగాహన కలిగి వుండలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీల పథకాలు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఏజెన్సీ ప్రాంతాలలో ప్రభుత్వ పరిపాలన రాజ్యాంగ బద్ధంగా జరగడంలేదని వాపోయారు.రాష్ట్ర ప్రభుత్వం రూపొందిచించే సంక్షేమ పథకాలు ఏజెన్సీ ప్రాంత చట్టాలకు లోబడి ఉండాలన్నరు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం నుండి గతంలో గిరిజనేతరుడు ఇంటి పన్ను ఇవ్వాలని హై కోర్ట్ ను ఆశ్రయించగా అప్పటి హై కోర్ట్ ప్రధాన న్యాయ మూర్తి నవీన్ రావ్ షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనేతరులకు ఇంటి పన్నులు ఇవ్వరాదని వ్యాఖ్యానించినట్లు గుర్తు చేసారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన గృహ లక్ష్మి పథకం ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘించే విధంగా ఉందని తెలంగాణ న్యాయస్థానం నిలుపుదల చేసినట్టు ఆయన తెలియజేశారు. కేసు నెంబర్ 29444/ 2023 అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో పంచాయితీ అధికారులు సాధారణ గ్రామ సభలను నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రభుత్వం ఏజెన్సీ చట్టాలను నిర్వీర్యం చేసినట్టుగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేయాలని చూడటం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే ప్రతి సంక్షేమ పథకం పైన గిరిజన సలహా మండలి లో ముందుగా చర్చ జరగాలని తెలిపారు. గిరిజన సలహా మండలి ఆదేశాల ప్రకారమే గిరిజన ప్రాంతాల్లో సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. గిరిజన సలహా మండలి ని సత్వరమే ఏర్పాటు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో అట్టం లక్ష్మయ్య, శివ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అభయహస్తం ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం,

- "కాంగ్రెస్ పార్టీ నాయకులకు,ప్రజాప్రతినిధులకు,ప్రజలకు నమస్కారం"
- "138 ఏళ్ళ చరిత్ర కలిగిన "కాంగ్రెస్ పార్టీ"ఆవిర్భావ దినోత్సవం సందర్బంగా"
- "సోనియా గాంధీ ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమ6 పథకాల అమలుకు శ్రీకారం."



**"ములుగు జిల్లా సి కె న్యూస్ ప్రతినిధి భార్గవ్"**:-తేదీ: 28.12.2023 నుండి 06.01.2024 వరకు
ప్రజల నుండి దరఖాస్తుల స్వీకరణ,
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ శ్రీ అనుముల.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు , మన ప్రియతమ నాయకురాలు పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి,మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రీ వర్యులు శ్రీమతి.%ణతీ%.దనసరి అనసూయ(సీతక్క) పిలుపు మేరకు కన్నాయిగూడెం మండలంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మహిళా నాయకురాళ్లు,యువ నాయకులు,ఉద్యోగులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలి-ప్రతీ గ్రామంలో ఉన్న ప్రజలు నిరుపేద కుటుంబాలు,ప్రతీ ఒక్కరు మహాలక్ష్మి,రైతు భరోసా,ఇందిరమ్మ ఇండ్లు,గృహజ్యోతి,చేయూత పథకాల లబ్ధి కొరకు ఈ ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని కోరుకుంటున్నాను,
కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ
యువ నాయకులు టీపీసీసీ మీడియా మండల్ కో -ఆర్డినేటర్
గాందర్ల నర్సింగరావు

# కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ప్రజలందరూ అప్లై చేసుకోవాలి

**18వ వార్డ్ కౌన్సిలర్ కామిశెట్టి శైలజ భాస్కర్**



**సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి ( శ్రీనివాస్ )డిసెంబర్ 27:**చౌటుప్పల మున్సిపల్ 18 వ వార్డులో బెడ బుడగ జంగాల కాలనీలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 6 ప్రజా సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 28 నుండి 6 జనవరి 2024 వరకు కొనసాగించే అప్లికేషన్ల స్వీకరణ గురించి కాలనీ వాసులకు స్థానిక వార్డు కౌన్సిలర్ కామిశెట్టి శైలజ భాస్కర్ వివరించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ కామిశెట్టి శైలజ కాలనీవాసులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ పథకాలను ప్రజలు అందరూ వినియోగించుకోవాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సోనియగాంధీ జన్మదిన సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని అన్నారు .డిసెంబర్ 28 నుండి 6 జనవరి 2024 వరకు తెలంగాణ ప్రభుత్వం అభయ హస్తం పేరుతో ఇల్లు లేని వారికి ఐదు లక్షల ఆర్థిక సహాయం కొత్త రేషన్ కార్డులు మరియు రేషన్ కార్డులో ఉన్న మహిళలకు గృహలక్ష్మి 2500 ఇవ్వాలని గత అసెంబ్లీ ఎన్నికల్లో మాన్ ఫెస్టోలో పెట్టి రేపటినుండి అమలు చేయటానికి కార్యారూపం దాల్చింది అని అన్నారు.ఇట్టి కార్యక్రమాన్ని ప్రజలందరూ గ్రామసభల్లో పాల్గొని మీ సమస్యలను మీకు కావాల్సిన పథకాలను అప్లై చేసుకోవాల్సిందిగా కౌన్సిలర్ కోరినారు .కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాన్ని ప్రతి ఒక్కరు ప్రజలలోకి తీసుకువెళ్లి ఈ పథకాలను పేద ప్రజలకు అందే విధంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని అన్నారు .ఈ కార్యక్రమంలో తూర్పాటి శంకర్ ,బొబ్బిళ్ళ మురళి, కాంగ్రెస్ జిల్లా నాయకులు చింతల సాయిలు, ఓర్స్ రాజు, తూర్పాటి నరసింహ ,తూర్పాటి దశరథ ,పస్తం యాదయ్య, పస్తం రాంబాబు ,కళ్లెం మల్లేష్ ,మాదాని ఎల్లప్ప ,తూర్పాటి శ్రీను ,కళ్లెం మల్లేష్ ,పస్తం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ కిషన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు.



**సీకే న్యూస్ ప్రతినిధి :** కురవి మండలం పెద్దతండా గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన మాజీమంత్రి సత్యవతి రాథోడ్ అన్న గుండ్రాతి మడుగు గ్రామం మాజీ సర్పంచ్ గూగులోత్ కిషన్ నాయక్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన, అనంతరం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన డోర్నకల్ మున్సిపాలిటీ చైర్మన్ వీరన్న, వార్డ్ కౌన్సిలర్ సురేందర్ జైన్ . ఈ కార్యక్రమంలో డోర్నకల్ మున్సిపాలిటీ వార్డ్ కౌన్సిలర్లు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# ప్రజా పాలన గ్రామసభల తేదీలు ఖరారు.

**గూడూరు మహబూబాబాద్ సీకే న్యూస్ ప్రతినిధి :**గ్రామ పంచాయతీలో నిర్వహించే ప్రజా పాలన గ్రామ సభల తేదీలను ఎంపీడీవో రోజారాణి బుధవారం ఖరారు చేయడం జరిగింది. గూడూరు మండలంలోని 39 గ్రామపంచాయతీ లలో ఈ ప్రజా పాలన గ్రామసభల లో 6గ్యారెంటీ పథకాలను అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సులు జారీ చేయగా ఈ గ్రామ సభలు డిసెంబర్ 28వ తారీకు నుండి జనవరి 5వ తారీఖు వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో రోజా రాణి తెలిపారు. పాటిమీద తండా, చక్రు తండా, జగనాయకులగూడెం, దుబ్బగూడం, ఊట్ల, శ్రీ హనుమాన్ తండా గ్రామాలలో 28 తారీఖున,చిర్రకుంట తండా, రాములు తండా జంగుతండ, గోవిందపురం, పడమటి తండా, పొనుగోడు లలో 29వ, బొద్దుగొండ, ఎర్రకుంట తండ, నాయక్ పల్లి, ఏపూరు, లైన్ తండా, లక్ష్మీపురం తండాలలో 30న, మర్రిమిట్ట,రాజన్ పల్లి, గూడూరు,అయోధ్య పురం, మట్టేవాడ,మచ్చెర్ల గ్రామాలలో జనవరి 2వ తేదీన గుండెంగ, టిఆర్ఎస్ తండ, అపరాజుపల్లి, దామరవంచ, మదనాపురం, గాజుల గట్టు, లలో 3వ తారీఖున, బ్రాహ్మణ పల్లి, కోబల్ తండ, చిన్న ఎల్లాపూర్, భూపతి పేట, వేంగంపేట, సీతానగరం గ్రామాలలో 4వ తేదీన, బొల్లెపల్లి, కొల్లాపురం, తీగలవేణి 5వ తేదిన ఈ గ్రామాలలో ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించాలని దరఖాస్తులు స్వీకరించాలని ఎంపీడీవో రోజా రాణి కోరారు. ఇట్టి గ్రామసభల అధికారులు ఎమ్మార్వో అశోక్ కుమార్ ఎంపీడీవో రోజా రాణి ఏవో రాకేష్ లు పాల్గొంటారు. కార్యదర్శులు సమయానుకూలంగా ప్రజలకు అందుబాటులో సేవలు చేయాలని రోజా రాణి కోరారు.

# నిరుపేదలకు 6 గ్యారెంటీలు నెరవేర్చాలి



**సీకే న్యూస్ ప్రతినిధి :**వంగపహాడ్ లో 2వ.డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ... అర్హులైన నిరుపేదలకు 6 గ్యారెంటీలు అమలు త్వరగా నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు 6 గ్యారెంటీలలో రేషన్ కార్డులేని అర్హులు చాలామంది ఉన్నారని వారికి కూడా అర్హత కాలగించలని అలాగే రైతు బంధు పడని రైతులు చాలా మంది ఉన్నారని వారికి కూడా రైతు బంధు నిదులు త్వరగా వేయాలని అన్నారు రేషన్ కార్డు లేని అర్హులైన పేదలకు రేషన్ కార్డులను మంజరు చేయాలని అన్నారు రైతు బంధుకు రేషన్ కార్డుతో ముడి పెట్టవద్దని అన్నారు 6 గ్యారంటీ ల పథకాల అమలులో జాప్యం చేస్తే రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆధ్వర్యంలో పోరాడతామని అన్నారు.

# అయ్యప్ప దేవాలయం లో ఘనంగా ద్వితీయ పుష్కర కుంభాభిషేకం

**నర్సంపేట సీకే న్యూస్ ప్రతినిధి :**నర్సంపేట పట్టణంలోని అయ్యప్ప దేవాలయ ప్రాంగణం లో బుధవారం రోజున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ఉత్తమ సేవారత్న అవార్డు గ్రహీత కీర్తిశేషులు శింగిరికొండ రామాంజనేయులు గుప్తా అండాలమ్మ వారి ఆశీస్సులతో. ఆలయ సేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా రజిని ఆధ్వర్యంలో 23వ మండల పూజ మహెూత్సవం లో రామ్ సాయి మండల పూజ మహెూత్సవం లో ఆలయ ద్వితీయ పుష్కర కుంభాభిషేకం యాగాన్ని ఆలయ వేద పండితులు శ్రీమాన్ బ్రహ్మశ్రీ సి వెంకటేశ్ శర్మ పూజ నిర్వహణలో గర్భగుడిలోని స్వామికి ఘనంగా పూజలు నిర్వహించరు. అనంతరం స్వామి వారి ప్రధాన పడిమెట్ల ముందు కలిశాభిషేకం నిర్వహించారు. ఈ పూజలో కార్యక్రమం లో 40 మంది దంపతులు పాల్గొనగా ఆలయ నిత్య అర్చకులు దేవేష్ మిశ్రా, చేతుల మీదుగా ప్రధాన జ్యోతులు వెలిగిస్తూ గణపతి పూజతో మొదలుకొని పుట్ట మట్టి గోమాత పూజలు చేస్తూ సమస్త దేవతలు అయ్యప్పను ఆహ్వానించగా కర్ర చెక్క పై అగ్నిపర్తనం చేస్తూ హెూమగుండ పూజలు నిర్వహించరు. సర్వతో భద్ర మండపం వాస్తు మండపం క్షేత్రపాలక మండపం అంకురారోపణ మాతృక మండపం, యోగిని మండపం, నవగ్రహ మండపం, అగ్ని మధనం నవ చండీ హెూమం, సుదర్శన హెూమం, యజుర్వేద ద్వారా అధర్వణ వేదద్వారం ఋగ్వేద ద్వారముల లో యాగశాల నిర్మించరు.చైర్మన్ శిరస్సుపై ముఖ్య కలశం తో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా మంగళ వాయిద్యాలతో యాగశాల ప్రధాన సామవేద ద్వారం గుండా గుమ్మడికాయ టెంకాయల పూజలతో తెల్ల నువ్వుల బలిదానంతో అఖండ దీపం వెలిగిస్తూ సహస్ర కలశాభిషేకం పూజలో నూతన కలశం కొబ్బరికాయ నూతన వస్త్రాలు పచ్చని తోరణాలలో తాంత్రిక పూజ విధానంలో పూజలు నిర్వహించరు.
42వ మహా అన్నదానంలో దాతలుగా డాక్టర్ భీమ గాని లక్ష్మీనారాయణ చంద్రకళ, గూడూరు వాస్తవ్యులు ఉసిరిక్కపల్లి వెంకటేశ్వరరావు వసుధ,అనంతుల రామనారాయణ రాజకళ, మాంటిసోరి స్కూల్ యజమాన్యం ఎర్ర జగన్ మోహన్ రెడ్డి ఊర్మిళ, వెంకటరమణారెడ్డి స్వప్న,సిరికొండ వినోద్ కుమార్ వసుధ, గుట్టపర్తి రాజేందర్ త్రివేణి,ధారావత్ దస్తరు పార్వతి మనీ,ఈశ్వర వీరభద్ర నాయక్,బొకేరాజు భూక్య ఐశ్వర్య లు ఆలయ పూజలు చేయగా భక్తుల అన్నదానంలో పాల్గొన్నారు. చైర్మన్ మాట్లాడుతూ నర్సంపేట బొడ్రాయి నుండి స్వామివారిని ఊరేంపుగా ఆలయంలోకి తీసుకురాగా ఈరోజు ఆలయ వార్షికోత్సవం 24 సంవత్సరాలు కొనసాగుతుండగా 12 సంవత్సరాల ఒకసారి వచ్చే పుష్కర కుంభాభిషేకం ద్వితీయ కుంబాభిషేకం లో 1000 మంది భక్తులు, రూ 1251 రసీదు చెల్లిస్తూ పాల్గొనడం సంతోషం వ్యక్తపరుస్తూ భక్తులు ఇంకా చేరుకోవాలని కోరుతూ ఆలయంలో ఈనెల 27,28, 29 రోజులలో ప్రతిరోజు 5000 పైగా మందికి భోజన వసతి ఏర్పాటు చేయగా నర్సంపేట పలు ప్రాంతాల నుండి ఇతర ప్రాంతాల వారు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలంగాణ



రాష్ట్రం మంచిర్యాల జిల్లా అచలాపూర్ గ్రామంలో వేద పాఠశాల నుండి వేద పండితులు 11 మంది బృందంగా సుబ్రహ్మణ్యం, మణికంఠ శర్మ, సంతోష్ శర్మ ఓంకార్ శర్మ సుహాస్ శర్మ ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా, మాదారపు చంద్రశేఖర్ గుప్తా, దొడ్డ రవీందర్ గుప్తా, శ్రీరాం ఈశ్వరయ్య గుప్త, చింతల కమలాకర్ రెడ్డి, శ్రీరాముల శంకరయ్య, వంగేటి గోవర్ధన్ గుప్తా మాదాపూర్ రవీందర్, ఇరుకుల్ల వీరలింగం, పిన్న రామానందం,భూపతి లక్ష్మీనారాయణ, శింగిరికొండ వేణు గోపాల్ గుప్తా, పాలకుర్తి శ్రీనివాస్ గుప్తా, దొడ్డ వేణు గుప్త, మల్యాల రాజు గుప్తా, ఆకుల ప్రభాకర్ ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు గురుస్వాములు గుమస్తాలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# కశ్మీరు నేలను గెలిచారు.. హృదయాన్ని ఎవరు గెలవాలి!

“కశ్మీర్‌ను ఆధ్యాత్మిక ఔన్నత్యంతోనే జయించగలం. సైనిక బలంతో ఎప్పటికీ జయించలేం” ... దాదాపు 900 ఏళ్లనాడు కశ్మీర కవి కల్హణుడు అన్న మాటలవి. 75 ఏళ్ల ఆధునిక కశ్మీరు చరిత్రలో ఆధ్యాత్మిక ఔన్నత్యం అంతంత మాత్రంగా, బలప్రయోగం కొండొంత మాత్రంగా కనపడుతోంది. అందుకే జన హృదయాలపై గెలుపు దక్కటం లేదు. ఆర్టికల్ 370ని రద్దుచేయటంతో కశ్మీరులో కొత్త అధ్యాయం మొదలవుతుందన్న ఉహాగానాలు చాలా వచ్చాయి. సుప్రీంకోర్టు ఇటీవల ఆ రద్దుని సమర్థించటంతో ప్రధాన రాజకీయ స్రవంతిలో కశ్మీరు కరిగి పోతుందన్న ప్రకటనలు కోకొల్లలుగా వచ్చాయి. ఏ బలగాలను దృష్టిలో పెట్టుకుని కల్హణుడు ఆ మాటలు అన్నాడో కచ్చితంగా చెప్పలేకపోయినా ఒకటి మాత్రం స్పష్టం. అప్పటికి కశ్మీరుకు ముస్లిం దాడుల భయం లేదు. హిందూ రాజులను దృష్టిలో ఉంచుకునే కల్హణుడు ఆ వ్యాఖ్యలు చేసి ఉంటాడు. అప్పటికే కశ్మీరు సాంస్కృతికంగా కొంత విశిష్టతను సంతరించుకుంది. 1100ల నాటికి దేశవ్యాప్తంగా స్థానిక భాషల ఆధిక్యత ఆరంభమైంది. ఆ భాషల్లో సాహిత్య సృష్టి మొదలైంది. నన్నయ్య తెలుగు మహాభారత రచనే ఇందుకు నిదర్శనం. పలు రాష్ట్రాల ప్రత్యేక అస్తిత్వానికి అవసరమైన పునాదులు స్థానిక భాషలతోనే మొదలయ్యాయి. విశిష్ట భాష, సంస్కృతి లేకపోతే రాష్ట్రాల ఏర్పాటు వాదనలే తలెత్తేవి కావు. సంస్కృతులు ఎప్పుడూ ఆధ్యాత్మిక ఔన్నత్యాలకే ప్రభావితం అవుతాయి. బలప్రయోగాలతో రాజకీయాధికారం పొందొచ్చు. సాంస్కృతిక ఔన్నత్యాన్ని మాత్రం సాధించలేం. ఈ ఔన్నత్యానికి ఎన్ని అర్థాలైనా చెప్పుకోవచ్చు. భావాల బలంతో ప్రజలను ఒక కొత్త ధార్మికత, నాగరికతలోకి తీసుకువెళ్లటమే ఆధ్యాత్మిక ఔన్నత్యం అనుకుంటే కశ్మీరులో ఒకనాడు అది శాంతియుతంగా జరిగింది. సూఫీ ప్రవచనాల ప్రభావంతో కశ్మీరు సమాజం ఇస్లాంవైపు మొగ్గింది. శైవ మత సంప్రదాయాలతో వీధి పోరాటాలు చేసి ఇస్లాం అక్కడ పాదుకోలేదు. అందుకే అక్కడ సమ్మిళిత సంస్కృతి బలపడింది. కశ్మీరు పండితులెందరో ఇస్లాంని స్వీకరించారు. స్వీకరించని పండితులను అణగదొక్కలేదు. సమాజంలో వాళ్లూ కీలక పాత్ర పోషించారు. షేక్‌అబ్దుల్లా కుటుంబమూ ఒకనాడు పండిత వర్గానికి చెందిందే. సుప్రీం తీర్పును అనూహ్యం అనలేం. వాదనలప్పుడే ఆ సూచనలు కనిపించాయి. నాలుగేళ్ల సమయాన్ని తీసుకుని ఇచ్చిన ఆ తీర్పుపై సమర్థనలూ విమర్శలూ కూడా ఎక్కువగానే ఉన్నాయి. 70 ఏళ్ల పాటు ఉనికిలో ఉన్న రాష్ట్రాన్ని ప్రజల సమ్మతితో సంబంధం లేకుండా రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా హఠాత్తుగా మార్చివేయటం సాంకేతికంగా తప్పుకాక పోవచ్చు. సంక్లిష్ట సమస్యలపై న్యాయస్థానాల తీర్పులు ప్రజల్లో గట్టి అంగీకారాన్ని తీసుకురాగలిగితే అంతకన్నా సంతోషం ఉండదు. ఎన్నో సందర్భాల్లో అది జరగలేదు. అందుకే మెరుగైన పరిష్కారం కోసం జరిగే చర్చలనూ, చేపట్టే చర్యలనూ నిలువరించే శక్తి ప్రజాస్వామ్యంలో ఏ తీర్పుకూ ఉండదు. రిజర్వేషన్లు 50శాతం మించకూడదనీ రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చకూడదనీ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను తప్పుపడుతూ ఎన్నో విమర్శలు ఇప్పటికీ వస్తూనే ఉన్నాయి. కశ్మీరును భారత్‌లో కలిసిపోయేటట్లు చేయటమే ఆర్టికల్ 370 రద్దు లక్ష్యమైతే దాన్ని సాధించటమే ఇప్పుడు కేంద్రం ముందున్న పెద్ద సవాల్. కల్హణుడు చెప్పినట్లుగా దేశం ముందు రెండే మార్గాలున్నాయి. ముస్లిం విద్వేషాన్ని పక్కనపెట్టి ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ప్రదర్శించి కశ్మీరు పౌరసమాజంతో చర్చలు జరపటం మొదటిది. రెండోది బలప్రయోగం. కశ్మీరుకు బలప్రయోగం కొత్త కాదు. ఆధునిక కశ్మీరులో బలప్రయోగ దశలే ఎక్కువ. ఆధ్యాత్మిక ఔన్నత్యంతో కూడిన విలువలను కశ్మీరు రాజకీయాల్లో చూపించిన ఘటనలు చాలా తక్కువ. మొదట్లో ఆ దిశగా ప్రయత్నాలు జరిగినా క్రమేపీ అవి క్షీణించాయి. రాజకీయ అవసరాలు, అవకాశవాదాలు, సంకుచిత భావజాలాలు ప్రేరేపించిన మొండితనంతో బలప్రయోగం కశ్మీరులో నిత్యకృత్యమై పోయింది. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీరీ హృదయం కొత్తగా గాయపడలేదు. రద్దు నాటికే అది అలంకార ప్రాయంగా ఉంది. 1954 నుంచి తీసుకు వచ్చిన 28 రాజ్యాంగ ఉత్తర్వులతో 262 కేంద్ర చట్టాలను కశ్మీరులో అమల్లో పెట్టారు. కశ్మీరు సమస్యను లోతుగా విశ్లేషించిన సుమంత్రబోసు చెప్పినట్లు 1975 నాటికే ఆర్టికల్ 370 డొల్లగా మారింది. కశ్మీరు తొలి ప్రభుత్వాధినేత షేక్‌అబ్దుల్లాని అరెస్టు చేసిన తర్వాత 1954లో తీసుకొచ్చిన రాజ్యాంగ ఉత్తర్వుతోనే స్వయం ప్రతిపత్తి చాలావరకు అంతరించి పోయింది. 1957 జనవరి 26న అమల్లోకి వచ్చిన రాష్ట్ర రాజ్యాంగం భారత యూనియన్‌లో జమ్మూకశ్మీరును అంతర్భాగంగా పేర్కొంది. ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అఖిల భారత అధికారులను కశ్మీరులో నియమించటానికి అక్కడి అసెంబ్లీ 1958లో ఆమోదం తెలిపింది. ఇక 1965లో జమ్మూకశ్మీరు రాజ్యాంగానికి చేసిన సవరణలతో ఇతర రాష్ట్రాలతో అది దాదాపుగా సమానమైపోయింది. గవర్నర్ల నియామకం అమల్లోకి వచ్చింది. లోక్‌సభ సభ్యులను ఎన్నుకునే పద్ధతినీ ప్రవేశపెట్టారు. అప్పటివరకూ అసెంబ్లీయే లోక్‌సభకు సభ్యులను నామినేట్ చేసేది. 356, 357 అధికరణాలను కూడా వర్తింప చేశారు. రాష్ట్ర అంశాలపై కేంద్రం చట్టాలు చేసే పరిధిలోకి (ఆర్టికల్ 249) కశ్మీరును తీసుకువచ్చారు. కశ్మీరుకు స్వయం ప్రతిపత్తి కల్పించటం చారిత్రక మహాఘోరమన్న విమర్శలు ఈనాటివి కావు. ఆ విమర్శల్లో సహేతుకత ఉన్నా లేకపోయినా ఒక విషయాన్ని మాత్రం కొట్టేయలేం. అసలు ఆ ప్రతిపత్తే లేకపోతే కశ్మీరు భారత్‌లో విలీనం అయ్యేదే కాదు. మహాఘోరం ఏదైనా ఉంటే విలీనం తర్వాత కశ్మీరుపై ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చూపించక పోవటమే! 1947 అక్టోబరు 26న కశ్మీరు విలీనంపై మహారాజు హరిసింగ్ సంతకం చేశారు. అంతకుముందు పాక్‌తో యథాతథ ఒడంబడిక చేసుకున్నా గత్యంతరంలేని పరిస్థితుల్లో భారత్ సైన్య సహకారాన్ని కోరారు. రక్షణ, విదేశీ, కరెన్సీ%--%కమ్యూనికేషన్ల వ్యవహారాల్లో మాత్రమే కేంద్రానికి అధికారాలు ఉంటాయని విలీన ఒప్పందంలో పేర్కొన్నారు. దీన్ని స్పష్టంచేస్తూ 1949 అక్టోబరులో రాజ్యాంగంలో ఆర్టికల్ 306ఎ ను పొందుపర్చారు. 306ఎ స్థానంలో ఆర్టికల్ 370ని 1952లో ప్రవేశపెట్టారు. ఏదైనా కేంద్ర చట్టాన్ని జమ్మూకశ్మీరుకు వర్తింపచేయటానికి ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తప్పనిసరి చేశారు. ఇవన్నీ ఎందుకు చేశారు? ముస్లింలను సంతృప్తిపరచటానికే ఇవన్నీ చేశారని చెప్పుకోవటం చాలా తేలిక. కానీ అప్పటి పరిస్థితులు చాలా భిన్నమైనవి. కశ్మీర్ సమస్య అనేక సంక్లిష్టతలతో కూడినది. దేశ విభజనప్పుడు అనుసరించిన పద్ధతులను కశ్మీరు ప్రజలు తిరస్కరించి మరీ భారత్‌లో చేరారు. ఒక మతానికి చెందిన ప్రజల సంఖ్యని బట్టి ఆయా జిల్లాలు, ప్రాంతాల సరిహద్దులను నిర్ణయించి భారత్%--%పాక్‌ల్లో కలిపారు. అందుకే ఎన్నో ఐక్యతలను కలిగినప్పటికీ బెంగాల్, పంజాబ్‌లను మతప్రాతిపదిక మీద నిట్టనిలువుగా చీల్చారు. ఇదే సూత్రాన్ని జమ్మూకశ్మీరుకు అన్వయిస్తే కశ్మీరులోయతో పాటు జమ్మూ, లద్దాఖ్ ప్రాంతాలు కూడా భారత్‌లో విలీనమయ్యేవి కావు. మూడుచోట్లా సంఖ్యాపరంగా ముస్లింలకే ఆధిక్యం ఉండేది. నికరంగా భారత్‌కు నాలుగైదు జిల్లాలు మాత్రమే వచ్చేవి. వ్యాపారం, బంధుత్వం, మతం, సంస్కృతి, భౌగోళికం.. ఇలా దేన్ని తీసుకున్నా పశ్చిమ పంజాబ్‌తోనే కశ్మీరు ప్రజలకు ఎక్కువ సాన్నిహిత్యం ఉండేది. ఈ పరిస్థితుల్లో పాక్‌తో కలిసిపోవటం చాలా సులువు. కానీ అది జరగలేదు. దానికి షేక్‌అబ్దుల్లా సారథ్యంలోని నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించిన పాత్ర చాలా ఉంది. పాక్ ప్రేరిత సాయుధులు కశ్మీరులోకి చొచ్చుకు వచ్చినప్పుడు భారత సైన్యానికి చేదోడుగా నేషనల్ కాన్ఫరెన్స్ నిలిచింది. కాంగ్రెస్‌తో సన్నిహితంగా మెలిగే నేషనల్ కాన్ఫరెన్స్ భారత్‌వైపు మొగ్గు చూపించేది. దీన్ని కూడా పరిగణించి భారత్‌లో విలీనానికి మహారాజు సుముఖత చూపారు. పాక్‌తో కలవటానికి ఎన్నో అనుకూలతలు ఉన్న ప్రాంతం కాబట్టి షరతులతో కూడిన విలీనానికి అంగీకరించారు. గవర్నర్ జనరల్ మౌంట్‌బాటన్ కూడా ప్రజాభిప్రాయానికి లోబడే కశ్మీరు విలీనంపై తుది నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. ఆ షరతుతోనే విలీనానికి ఆమోదం తెలిపారు. ప్రజాభిప్రాయం అనుకూలంగా ఉందనే అంచనాతో ప్లెబిసైట్‌కు నెహ్రూ అంగీకరించారు. ఐరాసకు ఆ భరోసాతోనే కశ్మీరు సమస్యను నివేదించారు.

ఇంతటి సానుకూలత నాలుగేళ్లకే మారిపోవటం మొదలైంది. మూర?పు ముస్లిం వ్యతిరేకతతో కశ్మీరు స్వయం ప్రతిపత్తిని రద్దుచేయాలంటూ తలెత్తిన డిమాండ్లు రాజకీయ వాతావరణాన్ని మార్చివేశాయి. మరోవైపు షేక్‌అబ్దుల్లా ప్రభ్వుతం చేపట్టిన విప్లవాత్మక భూసంస్కరణలు భూస్వాముల్లో మంటలు పుట్టించాయి. స్వయం ప్రతిపత్తి రద్దు ఆందోళనలకు భూస్వాములు, సంస్థానానికి చెందిన మాజీ అధికారులు మద్దతు పలికారు. అన్ని వైపులనుంచీ ఒత్తిడులు రావటంతో స్వతంత్రంగా ఎందుకు ఉండకూడదనే ఆలోచనలు షేక్‌అబ్దుల్లా చేశారు. ఆ తర్వాతి పరిణామాలతో షేక్‌అబ్దుల్లాని అరెస్టు చేశారు. ఇక అప్పటి నుంచి ఢిల్లీ అనుకూల ప్రభుత్వాలు కశ్మీరులో కొలువుతీరాయి. ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించలేదు. అసంతృప్తితో ఉన్న ప్రజలను అదుపు చేయటానికి బలప్రయోగాలనే ఎంచుకున్నారు. విఫల ప్రభుత్వాలతో విసిగిన ప్రజలను పాక్ ఎగదోసింది. రకరకాల లక్ష్యాలతో తీవ్రవాదులు పుట్టుకొచ్చారు. 1990ల నుంచి 2005 వరకూ వేలమంది హతులయ్యారు. ఆ తర్వాత పరిస్థితి కొంత మెరుగుపడినా తగిన న్యాయం జరగలేదన్న భావన తొలగిపోలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర హోదానే రద్దుచేయటం, ఉద్యోగాలు, ఆస్తుల కొనుగోలు విషయంలో రక్షణలను తొలగించటం ఆ భావనను మరింత పెంచుతోందనే సమాచారమే వస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే తాము మరింత ఓడిపోతున్నామనే భావనలోనే కశ్మీరీయులు ఉండిపోతారు. అప్పుడు కల్హణుడు చెప్పినదే నిజమవుతుంది. లక్షల సైన్యం నేలను గెలుస్తుంది. హృదయాలను గెలవలేదు.

# కంటి చూపును కాపాడే ఆహారాలు ఇవి..!

## చేపలు, కోడిగుడ్లు మంచివి

## క్యారెట్లు, పాలకూర, బాదం గింజలు తీసుకోవచ్చు

## వీటిల్లో కంటిని కాపాడే ఇంగ్రెడియంట్లు

సర్వేంద్రియానాం నయనం ప్రధానం. మన శరీరంలో కళ్లకు ప్రాధాన్యం ఎంతో ఉంటుంది. కావాల్సిన పోషకాలు అందేలా చూసుకుంటే చాలు.. కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవచ్చు. అలాగే, కంటి నరాలపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. మధుమేహం, బీపీ ఉన్న వారు వాటిని నియంత్రణలో పెట్టుకుని, పోషకాహారం అందించడం ద్వారా కంటిచూపు దెబ్బతినకుండా చూసుకోవచ్చు. పోషకాలంటే విటమిన్ ఏ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అందించాలి.

కంటి చూపు ఎందుకు తగ్గుతుంది? అనే దానికి వయసు పెరగడం ఒక కారణం. ఫోన్లు, కంప్యూటర్ల స్క్రీన్లను గంటల తరబడి చూస్తుంటే కంటికి విశ్రాంతి తగ్గి, నష్టం జరుగుతుంది. ఇవి కాకుండా ఒత్తిడి, పోషకాల లేమితోనూ కంటి చూపు మసకబారుతుంది.



**చేపలు**

కంటికి చేపలు ఎంతో మంచి చేస్తాయి. చేపల్లోనూ సాల్మన్ రకం మంచివి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వులు. కనుక ఇవి చెడు కొవ్వులను తగ్గిస్తాయి. కళ్లు పొడిబారిపోకుండా, రెటీనాకు మేలు చేస్తాయి.

**బాదం గింజలు**

ఆల్మండ్స్ లో విటమిన్ ఈ తగినంత ఉంటుంది. ఇది కంటికి రక్షణనిస్తుంది. వయసు మీరడం వల్ల వచ్చే మాక్యులర్ డీజనరేషన్ నుంచి కాపాడుతుంది. అయితే, రోజులో బాదం గింజలను ఎక్కువ కాకుండా తీసుకోవాలి. అంటే ఒకేసారి మితిమీరి తినకూడదు.

**గుడ్లు**

కోడి గుడ్లలో విటమన్ ఏ, లూటిన్, జియాక్సాంతిన్, జింక్ ఉంటాయి. విటమిన్ ఏ కంటి కార్నియాకు ఎంతో అవసరం. కంటిలో కనిపించే ఉపరితలాన్ని కార్నియాగా పేర్కొంటారు. లూటిన్, జియాక్సాంతిన్ కంటికి సమస్యలు రాకుండా రక్షణనిస్తాయి. రెటీనా ఆరోగ్యానికి జింక్ సాయపడుతుంది. లూటిన్, జియాక్సాంతిన్ ను మన శరీరం తయారు చేసుకోలేదు. పాలకూరలోనూ ఇవి లభిస్తాయి.

**క్యారెట్లు**

క్యారెట్లలోనూ విటమిన్ ఏ పుష్కలంగా లభిస్తుంది. పైన చెప్పుకున్న ప్రయోజనాలకు అదనంగా, ఇన్ఫెక్షన్ల నుంచి కూడా విటమిన్ ఏ రక్షణనిస్తుంది.



నానబెట్టిన బాదం గింజలను రోజూ ఉదయం తినాలి
పొద్దున్నే నిమ్మరసం కలిపిన నీరు తాగాలి
స్ట్రెచింగ్ వ్యాయామాలతో నూ మంచి ఫలితాలు

# ఇలా చేస్తే.. జీర్ణక్రియకు తిరుగుండదు!

నేడు మారిన జీవనశైలి వల్ల ఎంతో మంది జీర్ణ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మన జీర్ణ వ్యవస్థ శరీరానికి కావాల్సిన ముఖ్యమైన పోషకాలను సంగ్రహిస్తుంది. వ్యర్థాలను తొలగిస్తుంది. నోటి నుంచి పేగుల వరకు ఈ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కడుపులో అసౌకర్యం, జీర్ణ సమస్యలతో తిన్నది వంటికి కూడా పట్టదు. బరువు తగ్గుతారు. ఈ సమస్యల నుంచి బయట పడేందుకు, జీర్ణశక్తిని పెంచుకునే ఉపాయాలు ఉన్నాయి.

**బాదం గింజలు**

బాదం గింజల్లో మంచి పోషకాలు ఉంటాయని తెలిసిందే. విటమిన్ ఈ, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, ప్రొటీన్, ముఖ్యమైన కెమికల్స్, ఫ్లావనాయిడ్, మినరల్స్ ఉంటాయి. మంచి కొలెస్ట్రాల్ కు కారణమవుతుంది. చెడు కొలెస్ట్రాల్, రక్తపోటును తగ్గిస్తుంది. దీంతో గుండె కు కూడా రక్షణ ఏర్పడుతుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ లో ప్రచురితమైన తాజా అధ్యయనం ఫలితాల ప్రకారం.. ప్రతి రోజూ బాదం తినడం వల్ల బ్యుటిరేట్ సింథసిస్ ప్రక్రియ మెరుగుపడుతుందని తెలిసింది. ఇది షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్. దీనివల్ల పేగుల ఆరోగ్యం బలపడుతుంది. పైగా బాదంలో ఉండే ఫైబర్ కూడా జీర్ణవ్యవస్థకు మంచి చేస్తుంది.

**నిమ్మరసం కలిపిన నీరు**

మనలో ఎక్కువ మందికి ఉదయం నిద్ర లేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉంటుంది. కానీ దీనికి బదులు నిమ్మరసం కలిపిన నీరు తాగి చూడండి. ఇది జీర్ణ వ్యవస్థకు ప్రేరణనిస్తుంది. కడుపుబ్బరం, కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే నిమ్మరసం కడుపులోకి వెళ్లిన తర్వాత అక్కడి నుంచి టాక్సిన్లను బయటకు పంపిస్తుంది. నిమ్మలో ఉండే అసిడిటీ జీర్ణ రసాలను ఉత్పత్తయ్యేలా చేస్తుంది. దీంతో తీసుకున్న ఆహారం కూడా చక్కగా జీర్ణమవుతుంది.

**వ్యాయామం**

ఉదయం వేళ వ్యాయామం మరో ముఖ్యమైన అంశం. స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. యోగా చేసుకోవచ్చు. రక్త ప్రసరణ పెరిగేలా వేగంగా నడవడం, ఏరోబిక్ వ్యాయామాలు, లేదంటే కాళ్లూ, చేతులను కదిలించేవి అయినా చేసుకోవచ్చు. దీనివల్ల కూడా జీర్ణశక్తి బలపడుతుంది. ముక్కు ద్వారా దీర్ఘ శ్వాస తీసుకుని నోటి ద్వారా విడుదల చేసేదీ అనుసరించొచ్చు.

# అనుష్క(42)..త్రిష(40) పెళ్లెప్పుడు?





సౌత్ లో క్రేజీ భామలుగా దూసుకుపోతున్న అందాల భామలు అనుష్క.. త్రిషల గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇద్దరు హీరోయిన్లు కలిసి పనిచేయని హీరోలు లేరు. తెలుగు..తమిళ్ భాషల్లో ఎన్నో చిత్రాల్లో నటించారు. రెండు దశాబ్దాలుగా ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నారు. నటన పరంగా తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నారు. లేడీ ఓరియేంటెడ్ చిత్రాల్లోనూ తమ బ్రాండ్ ని వేసారు. నేటి తరం నవనాయికలకు పోటీగా అవకాశాలు అందుకుంటున్నారు. ముఖ్యంగా సీనియర్ హీరోలకు ఈ భామలిద్దరు మంచి ఆప్షన్ గా కనిపిస్తున్నారు. చిరంజీవి.. బాలయ్య... వెంకటేష్.. నాగార్జున.. రవితేజ లాంటి స్టార్లకు సరిజోడీగా ఈభామల్ని చెప్పొచ్చు. సీనియర్ నాయికల్ని తీసుకోవాల్సి వస్తే మేకర్స్ కచ్చితంగా ఈ ఇద్దరి భామల పేర్లను పరిశీలనలోకి తీసుకోవాల్సిందే. ఇక చిరంజివి తర్వాత జనరేషన్ హీరోలతోనూ భామా మణులు కలిసిపనిచేస్తున్నారు. స్టోరీ డిమాండ్ మేరకు తమని తాము సునాయాసంగా మౌల్డ్ చేసుకుంటున్నారు. ఇలా కెరీర్ పరంగా తిరిగి చూడాల్సిన పనిలేదు. మరో ఐదారేళ్ల పాటు తిరుగుండదు.దమరి పెళ్లి మాటేంటిబీ? అంటే మాత్రం సరైన సమాధానం దొరకలేదన చెప్పాలి. ఇద్దరు ఇప్పటికే 40 ఏళ్లకు పైబడ్డారు. కానీ ఇంతవరకూ వివాహ గడియలు మాత్రం రాలేదు. అప్పట్లో త్రిష .. వ్యాపార వేత్త వరుణ్ మనియన్ తో నిశ్చితార్థం చేసుకుంది. కానీ అది పెళ్లివరకూ దారి తీయలేదు. పొరపొచ్చాలు రావడంతో ఎంగేజ్ మెంట్ తో ఆ బంధానికి పుల్ స్టాప్ పెట్టింది. ఆ తర్వాత త్రిష ఎవరితోనూ ప్రేమలోనూ పడింది లేదు.పెళ్లి వార్త వచ్చింది లేదు. ఇక అనుష్క పెళ్లి విషయంలో బలమైన ప్రచారం కూడా లేదు. వయసు 42 వచ్చేసినా నో మ్యారేజ్ అంటోంది. ఇంట్లో తల్లిదండ్రులు పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నా మనసుకు నిచ్చిన కుర్రాడు దొరకలేదని దాటేస్తుంది. మరి ఈ భామలిద్దరు 2024 లోనైనా వివాహంతో ధాంపత్య జీవితంలోకి అడుగు పెడతారేమో చూడాలి.



అనుపమ పరమేశ్వరన్ చీరలో ఆకట్టుకుంది

## అప్సర రాణి యొక్క స్టీమీ క్లిక్‌లు



# పుష్ప2 తర్వాత.. బన్నీ ప్రాజెక్టు అదేనా?





ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం 'పుష్ప 2' షూటింగ్ తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. పార్ట్-1 భారీ సక్సెస్ అవడంతో 'పుష్ప 2' ని అంతకుమించేలా ప్లాన్ చేశారు డైరెక్టర్ సుకుమార్. దాదాపు రూ.400 కోట్ల భారీ బడ్జెట్ తో మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే పుష్ప 2 తర్వాత అల్లు అర్జున్ ఎవరితో సినిమా చేయబోతున్నాడనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే త్రివిక్రమ్, సందీప్ రెడ్డి వంగ లాంటి దర్శకులతో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసేందుకు కమిట్ అయ్యాడు బన్నీ. ఆమధ్య బోయపాటితో కూడా సినిమా చేయబోతున్నట్లు వార్తలు వినిపించాయి. అయితే లేటెస్ట్ టాలీవుడ్ రిపోర్ట్స్ ప్రకారం 'పుష్ప 2' తర్వాత బన్నీ కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీతో సినిమా చేయబోతున్నారట. ఈ ఏడాది బాలీవుడ్ అగ్ర హీరో షారుక్ ఖాన్ తో 'జవాన్' సినిమాను తెరకెక్కించి బ్లాక్ బస్టర్ హిట్ ని సొంతం చేసుకున్నాడు అట్లీ. ఈ సినిమాతో నార్త్ లో అట్లీకి భారీ డిమాండ్ పెరిగింది. జవాన్ తర్వాత మళ్లీ షారుక్ ఖాన్, దళపతి విజయ్లతో ఓ మల్టీ స్టారర్ ప్లాన్ చేస్తున్నట్లు ఇటీవల వెల్లడించిన అట్లీ ఇప్పుడు ఐకాన్ స్టార్ తో సినిమా చేసేందుకు రెడీ అయినట్లు తెలిసింది. బన్నీతో సినిమా చేసేందుకు చాలాకాలంగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు ఈ కోలీవుడ్ దర్శకుడు. అంతెందుకు జవాన్ సినిమాలోనే బన్నీ ని క్యామియో రోల్ కోసం అప్రోచ్ కూడా అయ్యాడు. కానీ అందుకు బన్నీ నో చెప్పాడు. అయితే ఈసారి మాత్రం ఐకాన్ స్టార్ తో ఫుల్ ఫ్లెడ్జ్ సినిమా తీయబోతున్నట్లుగా టాక్ వినిపిస్తోంది. 2024 మార్చ్ లేదా ఏప్రిల్ లో అట్లీ తన నెక్ట్స్ ప్రాజెక్ట్ ని స్టార్ట్ చేయాలని అనుకుంటున్నాడట. అప్పటికి అల్లు అర్జున్ పుష్ప 2 షూటింగ్ కంప్లీట్ అవుతుంది. కాబట్టి బన్నీ డేట్స్ కూడా కలిసి వస్తాయి. అల్లు అర్జున్ ని మునుపెన్నడూ చూపించని విధంగా ఓ సరికొత్త పాత్రలో భారీ కమర్షియల్ ఎంటర్టైనర్ ని అట్లీ ప్లాన్ చేయనున్నట్లు సమాచారం. పుష్ప 2 రిలీజ్ అనంతరం అంటే ఆగస్టులో ఈ ప్రాజెక్టు సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అనిరుద్ రవిచంద్రన్ ఈ ప్రాజెక్టుకు సంగీతం అందించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. న్యూ ఇయర్ సందర్భంగా ఈ ప్రాజెక్టుని అఫీషియల్ గా అనౌన్స్ చేసే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాల ద్వారా సమాచారం అందుతుంది.